ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
4 సెప్టెంబర్, 2011

'రేటు' కోసమే రేటింగ్స్

2011 హ్యాపీబర్త్‌డే

(2011 సెప్టెంబర్ 4 నుంచి
2011 సెప్టెంబర్ 10వరకు)

కె.నేహ
3సం॥, సెప్టెంబర్-7
వరలక్ష్మి-శ్రీనివాస్
లావేరురోడ్డు-విజయనగరం

బిందుమైత్రి
సెప్టెంబర్-4
పుష్పలత-మట్టయ్య
ఖమ్మం

శ్లోకశ్రీ
సెప్టెంబర్
లావణ్య-మల్లేష్
దౌల్తాబాద్-మెదక్

కె.సాహితి
9సం॥, సెప్టెంబర్-2000
శివకుమారి-కె.వి
బాలాజీనగర్-విజయవాడ

వై.సంపత్‌కుమార్
9సం॥, సెప్టెంబర్-2000
సుజాత-రత్నం
ఎన్.ఎన్.ఆర్ కాలనీ-కడప

కె. జెన్ని-లెనిన
సెప్టెంబర్
నాగమణి-వెంకటేశ్వరరావు
దంతెలబార-ఖమ్మం

అనుదీప్ సత్యసాయి
సెప్టెంబర్
అనురాధాదేవి-మురళీకృష్ణ
చీడిగ-కాకినాడ

కీర్తన
సెప్టెంబర్-10
రమ-నాగేశ్వరరావు
వెంకటాయపాలెం-ఖమ్మం



చిన్నారి
సెప్టెంబర్
పద్మ-వసంత్

దీలీప్-దీపిక
8సం॥, సెప్టెంబర్-5
శోభారాణి-వెంకటాచారి
ధర్మజీపేట-మెదక్

వి.ఆదిత్య
6సం॥, సెప్టెంబర్-9
వేణి-రమేష్‌బాబు
నగరి-చిత్తూరు

విక్రాంత్‌రెడ్డి
2సం॥, సెప్టెంబర్-2009
సుధ-శివారెడ్డి
ఎర్రపాలెం-ఖమ్మం

మనలో మాట

హక్కులు - ఉల్లంఘన ..!

మన చట్టసభలు రూలు ప్రకారం ఎవరికీ చుట్టాలు కావు, కారాదు. అవి కట్టుదిట్టంగా నడవాలి. దేశస్తులంతా చెట్టాపట్టాలేసుకొని నడిచేలా దోహదపడాలి. అంటే- మన చట్టసభల ప్రతినిధులు నీతీ నిజాయితీలతో ఆదర్శవంతంగా ఉండాలి. సహనం, సామరస్యం వాళ్లలో వెల్లివిరియాలి. దేశస్థితిగతులను, ప్రజల పరిస్థితులను సభల్లో ప్రస్తావించాలి. ప్రసంగాల ద్వారా ప్రతిబింబించాలి. ఇలా మనం మన రాజ్యాంగంలో రాసుకున్న రూల్సూ, రెగ్యులేషన్సూ- ఇప్పుడు అవన్నీ జాన్తా నై అయిపోయాయి! చట్టాలను, చట్టసభలను సొంత ప్రయోజనాలకు వాడుకోవడం ఏలినోళ్లకు మామూలైపోయింది. ప్రశ్నలు అడగటానికి సొమ్ము తినేవాళ్లు కొందరైతే.... ఏమీ అడక్కుండా, అడ్డుకోకుండా ఉండటానికి మనీ మెక్కేవాళ్లు మరికొందరు..! ప్రజాస్వామ్యం ఇలా 'వర్ధిల్లటం' మూలానే- కొందరికి చట్టసభలు సొంత పనులు చక్కదిద్దుకొనే స్వీయోద్ధరణ కేంద్రాలుగా మారిపోయాయి. అందుకనే- ఈ మధ్యకాలంలో ప్రజాసమస్యలు పక్కకుపోయాయి. సభలు ఎవరెంత తిన్నారో లెక్కలు విప్పుకొనే రచ్చబండలు అయిపోయాయి. ఒకరి గుట్టుమట్లు ఒకరు విప్పి చెప్పే సమయంలో- ఆవేశకావేశాలు పతాకస్థాయికి చేరి, తిట్లూ సిగపట్లూ వంటివి రక్తి కడుతున్నాయి.

ఇటీవల రాజస్థాన్ శాసనసభలో ప్రత్యర్థులపైకి బూట్లు విసిరి సభామర్యాదను మంట కలిపాడో భాజపా సభ్యుడు! తమిళ శాసనసభలో గతంలో చోటు చేసుకున్న ఒక ఉదంతం దుశ్శాసన పర్వాన్ని తలపించడం సంచలనం సృష్టించింది. మైకులు విరగ్గొట్టడం, బెంచీలు తిరగేయడం ... ఇప్పుడు చాలా సభల్లో సర్వసాధారణమైపోయింది. ఒప్పించగలిగిన మాటలు కరువైనప్పుడే ఇలాంటి భయపెట్టే చేతలు ముందుకొస్తాయి. శాసనసభల్లోని సీన్లు చూసి, జనం 'ఛెరా' అని ముక్కున వేలేసుకుంటున్నారు. కొందరి ప్రవర్తన మొత్తం సభలపైనే చులకనభావం ఏర్పడే పరిస్థితికి దారి తీస్తోంది. ఎంపీల పట్ల సినీనటుడు ఓంపురి అనుచిత వ్యాఖ్యలే దీనికి నిదర్శనం. ఆ ఉదంతం సభాహక్కుల ఉల్లంఘనగా ఫిర్యాదుకు దారి తీసింది. గౌరవ సభలను, సభ్యులను మర్యాదకరంగా చూడడం పౌరులందరి విధి. ఉల్లంఘిస్తే శిక్షార్హమే అవుతుంది. దానికి రకరకాల నిబంధనలు, నిర్వచనాలూ ఉన్నాయి. అదే సమయంలో సభ్యులు కూడా అలాగే ప్రవర్తించాలి. మైకులు విరగ్గొట్టడం చివరికి పాదరక్షలు విసురుకోవడం వంటి చర్యలు సభామర్యాదను పెంచవు. అలాగే ఎన్నికల వేళ ఇచ్చే హామీలూ, ఆ తరువాత జరిగే ఉల్లంఘనల మాటేమిటి? వాటినీ రికార్డు చేసి, ప్రజాహక్కుల ఉల్లంఘన కింద ప్రశ్నించే యంత్రాంగం ఒకటి ఉంటే ఎంత బాగుంటుంది!

★

ఈ సంచికలో....

టపా	...	2
వికాసం	...	3
కవిత్వమ్	...	4
కథ	...	6
అట్టమీది కథ	...	14
కొత్తపుస్తకాలు	...	20
ఎవరిగోల వారిది	...	21
బాలనేస్తాలు	...	22
మాటల కోట	...	24

ఇంకా...

సినిమా కబుర్లు ... 8

భారతీయ మార్కెట్‌పై హాలీవుడ్ చూపు



ఈ పేజీ ... 10

ఒక్క డాలర్ జీతగాడు!

చూద్దామా ... 12

అజంతా గుహలు ఆకట్టుకునే చిత్రాలు



ఆరోగ్యం ... 18

రోగులను చావబాదుతున్న మందుల కంపెనీలు



నాటి జ్ఞాపకాలు

'అట్టమీది కథ' చదివి షమ్మీకపూర్ జ్ఞాపకాల్లో మునిగిపోయాం. 'కొత్త పుస్తకాల'లోని రెండూ చాలా విలువైన పుస్తకాలనిపించాయి. 'బాలనేస్తాలు' మంచి కాలక్షేపాన్నిస్తోంది. రంగులద్దుకున్న మార్జాలాలు కనువిందు చేశాయి. కవితలన్నీ భావగర్భితంగా ఉన్నాయి. 'స్టాంపుల సేకరణ' హాబీగా ఉన్నవారిని 'కాలముద్రలు–తపాలాబిళ్లలు' వ్యాసం బాగా ఆకర్షిస్తుంది. నెట్ ఓపెన్ చేయగానే అందులో ముందుగా కనిపించేవి, ఆకర్షించేవి ఈ-షాపింగ్ ప్రకటనలే. ఇదే అంశంతో 'ఈ- పేజ్' ఉపయోగపడే సమాచారాన్నిచ్చింది. 'రుచి'లో చేపల స్పెషల్స్ అన్నీ బాగున్నాయి. ఎలాంటి అనారోగ్యం వున్నా వీటిని నిరభ్యంతరంగా తినొచ్చు. 'మనలో మాట' బాగుంది.

నేమాన సుభాష్‌చంద్రబోస్,
శ్రీకాకుళం.

భలే రంగు పిల్లులు

అడ్వర్‌టైజ్‌మెంట్లు, నెట్ షాపింగ్‌'లో చూసి వస్తువులు కొంటే అవి ఎంత కాలం మన్నుతాయో తెలీదు. 'ఈ - షాపింగ్' ప్రమాదకరం. కాలముద్రలు - తపాలా బిళ్లలు' కథనం బాగుంది. కె. విశ్వనాథ్ ఇంటర్వ్యూ చదివాక ఆయనతో మాట్లాడినట్లే అనిపించింది. అబ్బో... అనిపించే అంబానీ ఇల్లు నిజంగా ఇంద్రభవనమే. షమ్మీ కపూర్ 'అట్టమీది కథ, బాలనేస్తాలు'లో బొమ్మలు బాగున్నాయి. చివరి పేజీలోని రంగుల పిల్లులు ముద్దుగా ఆకట్టుకున్నాయి.

వాస్తు రామచంద్ర, నెల్లూరు.

కృషి అభినందనీయం

షమ్మీ కపూర్‌ని నాటీ హీరో షమ్మీ అనడం కన్నా 'ఎవర్‌గ్రీన్ నటరాజు' అనడం బాగుంటుంది. ఆయన జ్ఞాపకాలు ప్రతి ఒక్కరి హృదయ ఫలకాలపై ముద్ర వేసుకోవడమే కాదు, కమ్మని గీతాలకు ఊపిరి పోశాయి. 'తెలుసుకుందామా'లో తపాలా బిళ్లలకు సంబంధించిన చరిత్ర వివరాలు, మరెన్నో విషయాలను తెలిపాయి. అలనాటి స్వతంత్రోద్యమకాలం నుండి నేటి వరకు కొన్ని వందల రకాల తపాలా బిళ్లలు విడుదల చేసి మనకందిస్తున్న తపాలా శాఖ కృషి అభినందనీయం. 'తెల్లకాగితం సమర్పయామి, కెరటాలు' కవితలు జీవన పథానికి అద్దం పడుతున్నాయి. మనిషి జీవితంలో నిద్రలో కనే కలల గురించి ఈ వారం 'కథ'లో రచయిత సునిశితంగా వివరించారు. చాలా బాగుంది. 'ఏ కళాఖండమూ తీరుబడిగా చెక్కేది కాదు' అన్న విశ్వనాథ్ మాటలో ఎంతో నిజముంది. కె. విశ్వనాథ్, కె.రాఘవేంద్రరావు, దాసరి నారాయణరావు లాంటి త్రిమూర్తులు సినీ రంగంలో మళ్లీ ఎన్నాళ్లకో!

టి.వి.డి.ఎన్.సీతారామారావు,
విజయవాడ.

అంతరాల మేడ

'తెలుసుకుందాం' శీర్షికలో కాలముద్రలు - తపాలా బిళ్లలు వ్యాసం బాగుంది. సమాచార వ్యవస్థలో ఎన్ని మార్పులు వచ్చినప్పటికీ తపాలా వ్యవస్థను నిర్వీర్యం చెయ్యకుండా రక్షించుకోవాల్సిన అవసరం మనందరిపైనా ఉంది. ఇందులో చారిత్రక సంఘటనలను, వ్యక్తులను జ్ఞప్తికి తెచ్చే స్టాంపుల పాత్ర ముఖ్యమైంది. కొరియర్ సర్వీసులకు జవాబుదారీ తనం ఉండదు. కానీ పోస్టల్ సాక్ష్యాలు కోర్టులోనూ చెల్లుతాయి. ముఖేష్ అంబానీ ఇల్లు మన దేశంలోని ఆర్థిక అంతరాలకు నిదర్శనం. అటువంటివి సోషలిస్టు సమాజంలో ఉండవు.

టి. శ్రీరామమూర్తి, గాజువాక.

కాదేదీ కథకనర్హం



మనదేశంలో ఉన్న పెద్ద ప్రభుత్వ సంస్థల్లో తపాలాశాఖ ఒకటి. రాజకీయవేత్తలు, ప్రకృతి, సంగీత ప్రియులు, శాస్త్రవేత్తలు వంటి ఎందరో ప్రముఖుల ఫొటోలను తపాలా సంస్థ స్టాంపులు వేసి ముందు తరాలకు అందిస్తోంది. ఒక వ్యక్తి తాను ఎంచుకున్న పనిమీద దృష్టి నిలపడం వల్ల వచ్చే ఫలితం అద్భుతంగా ఉంటుందని తెలుసుకోడానికి కె.విశ్వనాథ్ ఇంటర్వ్యూ చదివితే చాలు. ఆయన సినిమాలు ప్రజల గుండెల్లో కలకాలం నిలిచిపోతాయి. 'తలెత్తి చూడగ తలపాగ వెడలిపోగ' పద్యానికి రుజువుగా ముఖేష్ అంబానీ భవంతి ఉందనిపించింది. కొన్ని పురాతన కట్టడాల్లాగే ఈ భవనానికీ రాళ్లెత్తిన కూలీలు కనుమరుగయ్యారు. షమ్మీకపూర్ జీవితంలో నేర్చుకోదగిన అంశాలు చాలానే ఉన్నాయి. కాదేదీ కథకు అనర్హం అని ఈ వారం 'కథ' ద్వారా తెలకపల్లి రవి రుజువు చేశారు.

ఇలిపిల్ల సూర్యనారాయణ,
విజయవాడ.

విజ్ఞానం

సూర్యకిరణాలు భూమధ్య రేఖాప్రాంతంలో పడినట్లు ధృవప్రాంతాల్లో పడవు. అందుకే భూమధ్య రేఖాప్రాంతం సాపేక్షంగా వేడిగా ఉంటుంది. ధృవప్రాంతాలు చల్లగా ఉంటాయి. వేసవిలో సముద్రాల మీద కన్నా ఖండాలమీద ఉష్ణోగ్రత ఎక్కువ. శీతాకాలంలో దీనికి వ్యతిరేకంగా ఉంటుంది. ఎక్కువ ఉష్ణోగ్రతా ప్రాంతాలు అల్పపీడన ప్రాంతాలవుతాయి. గాలి ఎప్పుడూ అధిక పీడనప్రాంతం నుండి అల్ప పీడనప్రాంతం వైపు వీస్తుంది. కాలానుగుణంగా దిశ మార్చుకుంటూ వీచే గాలులను రుతుపవనాలు అంటారు. వేసవిలో భారతదేశం వైపు బంగాళాఖాతం, అరేబియా సముద్రం నుండి నైరుతి దిశలో గాలులు వీస్తాయి. అందుకే వీటిని నైరుతి రుతుపవనాలు అంటారు. శీతాకాలంలో ఈశాన్యదిశ నుండి వీస్తాయి కాబట్టి ఆ గాలులను ఈశాన్య రుతుపవనాలు అంటారు. ఈ రెండు రుతుపవనాలు సముద్రాల పైనుండి వీస్తాయి. కాబట్టి వాటిలో నీటి ఆవిరి ఎక్కువ. ఇవి ఆసియా ఖండంలో అనేక ప్రాంతాల్లో వర్షాలు కురిపిస్తాయి. ఈ రుతుపవనాల ప్రభావం భూతలం నుండి నాలుగున్నర కిలోమీటర్ల ఎత్తు వరకు మాత్రమే ఉంటుంది. గాలి ఉష్ణోగ్రత పెరిగే కొద్దీ అది ఉంచుకోగల్గిన నీటిఆవిరి పరిమాణం పెరుగుతుంది. గాలి ఉష్ణోగ్రత తగ్గితే నీటిఆవిరి పరిమాణం తగ్గుతుంది. వేడిగాలి చల్లబడినప్పుడు అది కొంత నీటిఆవిరిని వదిలివేయవలసి వస్తుంది. ఉష్ణోగ్రత బాగా తగ్గినప్పుడు ఇది వర్షంగా మనకు కురుస్తుంది. ఇలా నీటిఆవిరి చల్లబడడం వల్ల అది భూమిని వర్షం, వడగళ్లు, మంచు, పొగమంచు, తుషారం ఇలా రకరకాల రూపాల్లో చేరుతుంది.

మేఘాల ముచ్చట్లు

- సి. వి. సర్వేశ్వరశర్మ

ఫోన్ నెం: 9866843982

sarma.chavali@gmail.com

నీటిఆవిరితో కూడిన వాయువు అల్పపీడన ప్రాంతం చేరి వ్యాకోచించి చల్లబడుతుంది. నీటిఆవిరి నీటి బిందువులుగా వాయువుతో జతపడుతుంది. ఇదే ఆకాశంలో మనకు మేఘంగా కన్పిస్తుంది. ఈ మేఘాలు పరిస్థితిని బట్టి గంటకు ముప్పై నుండి వంద కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంటాయి. ఎత్తును బట్టి మేఘాలను వేరు వేరు పేర్లతో పిలుస్తుంటారు. భూమికి ఆరు కిలోమీటర్ల ఎత్తులో ఉన్న మేఘాలను ఉన్నత మేఘాలంటారు. ఇక్కడ ఉష్ణోగ్రత తక్కువగా ఉంటుంది. అందువల్ల మేఘాలు మంచు స్ఫటికాలతో నిండి ఉంటాయి. ఈ స్ఫటికాల ఆకృతిని బట్టి మేఘాలను మూడు రకాలుగా చెబుతారు. మొదటి రకం మేఘాలను సిర్రస్ మేఘాలు అంటారు. ఇవి తెల్లగా గుర్రపుతోక ఆకారంలో మెరుస్తుంటాయి. రెండవరకం మేఘాలను సిర్రోస్ట్రాటస్ మేఘాలంటారు. ఇవి తెలుపురంగులో పల్చని పొరగా వ్యాపిస్తాయి. కాంతి వక్రీభవనం వల్ల ఇవి చంద్రుని చుట్టూ కనిపిస్తాయి. మూడవ తరగతి మేఘాలను సిర్రోక్యుములస్ మేఘాలు అంటారు. ఇవన్నీ మంచు కణాలతో గుంపులు గుంపులుగా ఉంటాయి. ఇవి వర్షాన్ని కురిపించవు. భూతలానికి మూడుకిలోమీటర్ల ఎత్తులో ఉండే మేఘాలను మధ్య తరగతి మేఘాలంటారు. వీటిని రెండు రకాలుగా వర్గీకరించారు. వాటిపేర్లు ఆల్టోస్ట్రాటస్, ఆల్టోక్యుములస్ మేఘాలు.

ఆల్టోస్ట్రాటస్ మేఘాలు నీలిరంగులో దట్టంగా ఉండి నిలకడగా వర్షాన్ని కురిపిస్తాయి. వీటివల్ల వాన జల్లులు పడవు.

ఆల్టో క్యుములస్ మేఘాలు మూడు రకాలు. స్ట్రాటో క్యుములస్, నింబో స్ట్రాటస్, స్ట్రాటస్ మేఘాలని వీటిని పిలుస్తారు. స్ట్రాటో క్యుములస్ ఆకాశం అంతా విస్తరించుకుని అప్పుడప్పుడు వర్షిస్తాయి. నింబోస్ట్రాటస్ దట్టంగా నిరాకారంగా ఉంటాయి. ఇవి నిలకడగా వర్షాన్ని లేదా మంచుని కురిపిస్తాయి. స్ట్రాటస్ మేఘాలు భూమికి కొద్దిపాటి ఎత్తులో పొగమంచును పోలి ఉంటాయి.

పైన వివరించిన మేఘాలన్నీ భూమికి సమాంతరంగా తక్కువ మందంలో విస్తరించి ఉంటాయి. క్యుములస్, క్యుములో నింబస్ అనే రెండు రకాల మేఘాలున్నాయి. ఇవి కొన్ని వేల కిలోమీటర్ల మందం ఉండి వేసవిలో కన్పిస్తుంటాయి. క్యుములస్ మేఘాలు జల్లుల వర్షం కురిపిస్తాయి. ఉరుములు, మెరుపులు కూడా ఉంటాయి.

క్యుములో నింబస్ మేఘం వల్ల ఉరుములు, మెరుపులతో కూడిన కుంభవృష్టి కురుస్తుంది. వడగళ్లు కూడా పడతాయి. అప్పుడప్పుడు చాలా అరుదుగా ఆకాశం నుండి భూమి వరకు గరాటు ఆకారంలో దట్టమైన మేఘం ఏర్పడుతుంది. ఈ మేఘం టొర్నడో అనే భయంకరమైన తుపానును సృష్టిస్తుంది.

ఎండను అదుపుచేస్తాయి!

శాస్త్రవేత్తల దృష్టిలో మేఘాలు కేవలం వర్షాలను కురిపించేవి మాత్రమే కాదు అవి భూమిపై పడే ఎండను నిర్ధారించగలవు. సూక్ష్మంగా చెప్పాలంటే సూర్యుడు విడుదల చేసే సౌరశక్తిలో ఎంత మేర భూమిని చేరాలో, ఎంత మేర రోదసిలోకి తిరిగి వెళ్లిపోవాలో ఈ మేఘాలు నిర్ణయించడం ఆశ్చర్యం అనిపిస్తుంది. భూమ్మీది నీటిని, గాలిని, సూర్యరశ్మిని... వీటన్నింటి మీద ఆధారపడి మనుగడ సాగిస్తున్న మానవ ఉనికిని కూడా ఈ మేఘాలు శాసిస్తున్నాయని చెప్పుకోవచ్చు. తేమగల గాలితో రూపొందిన మేఘాలు భూతలం నుండి గగనతలం వైపు వెళ్తుంటాయి. భూతలం నుండి ఎత్తుకి వెళ్లేకొద్దీ చల్లదనం పెరుగుతుంది. ఈ చల్లదనం కారణంగా మేఘంలో ఉండే నీటిఆవిరి పరిమాణం తగ్గుతుంది. ఫలితంగా మేఘాల్లో ఉన్న అధిక నీటి ఆవిరి, నీటి బిందువులు, మంచు స్ఫటికాలు... ఇలా ఏదో ఒక రూపంలో మేఘాల్లోని దుమ్ము, ధూళికణాల మధ్య చేరుతుంటాయి. వీటి కారణంగానే మనకు మేఘాలు కన్పిస్తాయి. తమాషా ఏంటంటే ఈ మేఘాల్లో నీరు లేదా మంచు బహు స్వల్పంగా మాత్రమే ఉంటుంది. ఆకాశంలో సూర్యరశ్మికి మేఘం అడ్డుగా వచ్చిందంటే ఎండలో కూర్చున్న మనకు ఎండ తీవ్రత తగ్గుతుంది. ఇది మనందరికి అనుభవంలోని విషయమే.

ఎండదెబ్బ

ఎండలో కూర్చున్న వారికి మేఘాలు ఎండ పడకుండా అడ్డుపడినప్పటికీ వారికి ఎండదెబ్బ తప్పదు. ఆకాశంలో దర్శనమిచ్చే అన్ని మేఘాల వల్ల మనిషికి ఇలాంటి ఎండదెబ్బ తగలదు. భూమిని చేరే ఎండ తీవ్రత అదుపు మేఘాలలో ఉండే రకరకాల పదార్థాలపై ఆధారపడుతుంది. భూమిని చేరే ఈ ఎండవల్ల భూగోళం వేడెక్కిపోవాలి. అలా జరగక పోవడానికి కారణం భూతలం నుండి వేడి ఏదో విధంగా తిరిగి రోదసిలోకి వెళ్లిపోతోందనే విషయం స్పష్టమౌతోంది. భూతలం వేడిని పరారుణ కిరణాల (ఇన్‌ఫారెడ్ రేస్) రూపంలో నేరుగాను, భూగర్భంలో ఉన్న గుప్తోష్ణం విడుదల కావడం ద్వారా భూమిని తనను తాను చల్లబరుచుకుంటోందని శాస్త్రవేత్తల భావన. వాతావరణంలోని కార్బన్ డై ఆక్సైడ్, నీటి ఆవిరి భూమి విడుదల చేస్తున్న ఉష్ణాన్ని పట్టి ఉంచడం వల్ల భూతాపం పెరుగుతోంది. దీన్నే గ్రీన్‌హౌస్ ఎఫెక్ట్ అంటారు. ఈ కారణంగానే మబ్బులు పట్టిన రాత్రి మబ్బులు లేని రాత్రి కన్నా వెచ్చగా ఉంటుందని గమనించాలి. పగటిపూట భూమికి చేరిన వేడి రాత్రి సమయంలో విడుదలయి, మబ్బుల కింద బందీ కావడం వల్ల రాత్రివేళల్లో వెచ్చదనం ఉంటుందనేది దీని వెనుక రహస్యం. మబ్బులను నియంత్రించి భూగోళ తాపాన్ని అదుపుచేయవచ్చు కదా! అనేవారున్నారు. అయితే ఇంకా మబ్బుల గురించి పూర్తిగా తెలియని మనం వాటిని ఎలా అదుపు చేయగలం అంటున్నారు శాస్త్రజ్ఞులు.

★

మూడు కోతులు

మంచిని మాట్లాడొద్దు
మంచిని చూడొద్దు
మంచిని వినొద్దు
మూడు కోతుల సందేశం మారింది!
దారి తప్పిన స్వాతంత్ర్యం
అర్ధరాత్రి చీకట్లో తిరుగాడుతుంది
వేగుచుక్క ఎదురురాదు
ఎంతకీ పొద్దు పొడవదు
తూర్పు తలుపులు తెరుచుకోవు
షష్ఠిపూర్తై సప్తతిలోకి నడుస్తున్న
తల్లి భారతి వృద్ధాశ్రమం చేరింది
ధుర్యోదన దుశ్శాసన దుర్మదాంధుల
ఏలుబడిలో రాజ్యం
ఒకరి సపర్యలో స్వాతంత్ర్యం
ఒకరి తాకట్టులో ఆర్థికం!
అవినీతి ఆక్సిజనైంది



ఆహారంలో దాగింది
నీటిలో కలిసింది
నీడగా మారింది
మంచిని మాట్లాడొద్దంటూ
మర్కటం మూతి మూసుకుంది!
అవినీతి కాళ్లను పెనవేసింది
చేతుల్ని చుట్టుకుంది
మాటల్లో మిళితమైంది
పాటల్లో ఎలుగెత్తింది
మంచిని వినవద్దంటూ
మారుతి చెవులు మూసుకుంది!
అవినీతి అందంగా ముస్తాబైంది
రాతకు శ్వేతపత్రమైంది
పఠనానికి పాఠ్యగ్రంథమైంది
చిత్రానికి కాన్వాసైంది
మంచిని చూడొద్దంటూ
కోతి కళ్లు మూసుకుంది!
అవనీతి ఆరోహణం
నీతి అవరోహణం!

- అడిగోపుల వెంకటరత్నమ్

కవిత్వమ్

క్రోనీ కేపిటలిజం



ప్రజాస్వామ్యపు వేదిక మీద
నవరస నటనా సార్వభౌములు
మన రాజకీయనేతలు
కథ, స్క్రీన్‌ప్లే, డైరెక్షన్
మాటలు, పాటలు అన్నీ
కార్పొరేట్ పెద్దలే
ఈ వర్ణచిత్ర మాయాజాలానికి
మత్తులై, గమ్ముత్తుగా చిత్తయ్యేది
హ్రస్వదృష్టిగల మన ఓటర్లే
ఈ విచిత్రం పేరు
క్రోనీ కేపిటలిజం

- పి. పున్నారావు

నానీలు

అడవిలో కూడా
పంజరమే!
బడికి సున్నం వేస్తూ
బాల కార్మికుడు

హరివిల్లును
సంధించి వదిలాడు
భానుడి భుజాన
మేఘం అమ్ములపొది

తప్పుడు ఓటు
తారుమారు చేసింది
పథకాలు పొరులకు
నిధులు ప్రతినిధులకు

ఇప్పుడు రాముడు
ఇంకాసేపటికి రావణుడు
సారా మత్తులో
సంస్కారం చిత్తు!

గట్టుమీద
చేపపిల్ల!
కమనీయ భావానికై
కవి తపన

గొప్పతనాల గొడవలు
ముగిసిపోయాయి
పల్లె పట్నం
సంధి చేసుకున్నాయి

- సోమిశెట్టి వేణుగోపాల్



ఆగని కాలం



ఆకాశం అంత ఎదగాలని
ఎన్నో ఆశలతో అడుగు ముందుకు
వెయ్యాలని అనుకుంటే!
కాలం ఒడిలో బానిసను అయ్యాను
చిగురంత ఆశకి నీరు పోస్తే చిగురించువేళలో
మండు వేసవి కాలం వచ్చి మాడిపోయింది
ప్రతి రేయి నాది అని ఆశించే ఆశలు నీరైకారి
ఎక్కాలనే నిచ్చెన కాస్త విరిగిపోయింది
కనురెప్ప మూయని క్షణం వుండునేమోకాని
కాలం అణు క్షణం కూడా ఆగదు అని తెలిసింది
గడిచిన కాలం తిరిగి రాక
వచ్చే కాలం ఆగక
ఈ మధ్య కాలంలో మనిషి జీవితం
ముగుస్తుందని తెలిసింది
కాలంతో మనం కూడా పరుగెత్తాలని అర్థమైంది

- మేరుగు రేణుశ్రీ

SPEAK ENGLISH FLUENTLY

6 లక్షలమందికి పైగా నేర్చుకున్న కోర్సు.

తెలుగు తెలిస్తే చాలు...
ఎవరయినా ఇంగ్లీష్ నేర్చుకోవచ్చు

K.V.R. B.Com.,B.L., (Director)

రోజుకు ఒక గంట చాలు...
సులభ సూత్రాలతో ఇంగ్లీష్ నేర్చుకోండి

అనేక సంవత్సరాల కృషితో, విద్యార్థుల సమస్యలను దృష్టిలో పెట్టుకొని, ఈ సులభ సూత్రాలను తయారుచేశాం. ఇంగ్లీష్ నేర్చుకోవటం సులభంగా మార్చేశాం. మీకు తెలుగు తెలిస్తే చాలు... మీరు ఇంట్లో ఉంటూనే చాలా సులభంగా ఇంగ్లీష్ నేర్చుకోవచ్చు.

స్పోకెన్ ఇంగ్లీష్‌లో శిక్షణ నిర్వహిస్తున్న కె.వి.ఆర్.

ప్రక్కనవున్న కూపన్ పంపండి లేదా ఇంకా ఈజీ:

CHENNAI:
0-9789099589

హాలో: లేదా మీ అడ్రసుకు కోర్స్ మెటీరియల్ పంపమని **SMS** చేయండి

కోర్సు ఫీజు రూ.1,000/-లు. పై టెలిఫోన్ నెంబరుకు మీ పూర్తి పేరు, ఇంటి నెం, ఊరి పేరు, పిన్‌కోడ్‌లతో వివరంగా మీ అడ్రసును SMS ద్వారా పంపండి. ఒక వారంలో పోస్ట్‌మేన్ కోర్సు ప్యాకెట్ తీసుకొని వస్తాడు. అప్పుడు పోస్ట్‌మేన్‌కు రూ.1,000/-లు చెల్లించి కోర్సు పొందవచ్చును. మీకు ఏమైనా సందేహాలు ఉంటే పై నెంబరుకు ఫోన్‌చేసి తెలుగులోనే మాట్లాడవచ్చు.

ఈ కూపన్ పూర్తి చేసి వెంటనే పంపండి.

H.O.CHENNAI

KVR INSTITUTE ™

AWARD WINNER

New No.26, Chari Street, T.Nagar, Chennai - 17.

నాకు కె.వి.ఆర్. ఇంగ్లీష్ కోర్స్ వి.పి.పి.లో పంపండి. పోస్ట్‌మేన్‌కు రూ.1000/-లు చెల్లించి పాకెట్ తీసుకుంటాను.

Name: ....

Address: ....

....Pin Code: [ ]

ప్రత్యక్ష శిక్షణ కేంద్రాలు: ● **SURYAPET:** Vinayaka Degree College, Beside Canara Bank. **Cell:**93913 68484, 92469 65030. ● **KHAMMAM:** Beside:Kaveri Restaurant, WyraRoad, **Cell:**94409 11478. ● **CHIRALA:** D.No.13/11/10, Polimera Road, M.M.R.Complex, **Cell:**98488 35625. ● **TANUKU:** D.No.27-8-11, Jeediguntavari Street, **Cell:**9392210039. ● **PALAKOL:** Beside: Chaitanya Hospital, Near:Telephone Exchange. **Ph:**228800, **Cell:**9247463900. ● **CHITTOOR:** M.B.R.Complex,D.I.Road, **Ph:**232502. **Cell:**98852 81530, 9052180134. ● **ADONI:** D.No.21-121, 1st Road, S.K.D. Colony, Near: Montessori School, **Cell:**93916 44633, 98855 12384. ● **KURNOOL:** D.No. 62/2, Fort, Near : Central Library, **Cell:**99855 01587. ● **DHONE:** Opp: Raja Theatre, Kothapeta, **Cell:**93904 95239 ,99480 32431 ● **TADIPATRI:** Vaddi Variety Hall, Shop No.26, Upstairs, C.B.Road, **Cell:**93473 53709,92900 91456.

ప్రత్యక్షశిక్షణా కేంద్రం ప్రారంభించాలనుకొనే వారు 93466 54210 నెంబర్‌కి ఫోన్ చేసి సంప్రదించండి.



నడిరేయి నడక

- నోముల సుదర్శన్ రెడ్డి

'జూలూరు' కండక్టర్ కేక వేశాడు. బస్సు ఆగిన కుదుపుకి శ్రీధర్‌కి మెలకువ వచ్చింది. కునుకు తీస్తున్న ప్రయాణికులు విన్నారో లేదోనని మరోసారి కండక్టర్ 'జూలూరు' అని గట్టిగా అరిచాడు. శ్రీధర్ జేబులు సర్దుకుని గబగబా బస్సు దిగాడు. రాత్రి ఎనిమిది గంటలకు భువనగిరి నుండి బయల్దేరాల్సిన బస్సు గంట ఆలస్యంగా బయల్దేరింది. సమయం రాత్రి పది దాటి ఉంటుందనుకున్నాడు. ఊరు దాటుతుంటే అక్కడక్కడా వీధిలైట్లు మసగ్గా వెలుగుతున్నాయి. ఒకటో, రెండో తప్ప ఇళ్ల, దుకాణాల తలుపులు మూసే ఉన్నాయి. ఆ రాత్రికి ఆ ఊళ్లో గడపడానికి దగ్గరి బంధువులెవరూ లేరు. అలా ఉండాలని కూడా అతను అనుకోవట్లేదు. ఊరు దాటి కుంటకట్టమీదకొచ్చాడు.

అమావాస్య ముందరి రోజులు. కారు చీకటి. పైకి చూశాడు. నిర్మలమైన ఆకాశంలో నక్షత్రాలు వెలిగిపోతున్నాయి. ఆ చుక్కల కాంతిలో తన ఊరికెళ్లే దారిని స్పష్టంగా చూడగలనని, ప్రయాణం చేయగలనని అనుకున్నాడు. జూలూరు నుండి అతని ఊరు జగత్పల్లి నాలుగు కిలోమీటర్లు ఉంటుంది.

కుంటకట్ట దాటగానే తార్రోడ్డు కనిపించింది. ఆ రోడ్డు వెంట గూడెం నుండి తన ఊరికి సులువుగా వెళ్లొచ్చు. కానీ ఒక కిలోమీటరు దూరం పెరుగుతుంది. చెల్కల్లోంచి కాలిబాట గుండా వెళ్తే తొందరగా ఊరు చేరొచ్చు. రోడ్డు దాటి ఓ వంద అడుగులేశాడు. చింత చెట్టుకింద చిక్కటి చీకటి. ఒళ్లు జలదరించింది.

పండిన గింజలు భువనగిరిలో అమ్ముకుని వస్తున్నాడు. ఇంటర్ చదువుతున్న తాను దసరా సెలవులకు ఇంటికొస్తే ఈ బాధ్యత అప్పగించింది తల్లి. డబ్బులు జేబులోనే ఉన్నాయి. జేబులు తడిమి చూసుకున్నాడు.

పడమటి నుండి చల్లటి గాలి చెవులను తగిలింది. అది చెరువు మీది నుండి వీచిన గాలి. తాను చెరువు పక్కగా నడుస్తున్నాడు. అంటే జూలూరు నుండి తాను ఒక కిలోమీటరు దూరం వచ్చాడు. ఆలోచిస్తూ ఎదురుగడ్డ ఎక్కి దిగాడు. చెరువు గట్టు మధ్య వరకు వచ్చాడు. చెరువు పక్కనుండే తన ఊరికి దారి. అందులో నీళ్లు నిండుగా ఉన్నాయి. కొద్దిగా చుట్టూ తిరిగి పోవాలి. నీటి తడికి అక్కడంతా పచ్చగడ్డి ఉంది. ఆ గడ్డిలో నుండి దారి కనిపించట్లేదు. అసలైతే ఆ నడిచే బాటలో గడ్డి అణిగి ఉంటుంది. పగటి పూటైతే బాగా కనిపిస్తుంది. చీకట్లో సరిగా కనిపించట్లేదు. కళ్లు చికిలించి జాగ్రత్తగా నడవాల్సొస్తుంది. బురద నీళ్లతో చిక్కులుంటాయి. చెరువు గట్టు సగం దూరం దాటాక ఊరికి వెళ్లే దారిని జాగ్రత్తగా పట్టుకుని నడుస్తున్నాడు. మామిడి చెట్ల చెల్క దాటాడు. పెద్దగుండు పక్కనుండి నడుస్తున్నాడు. తోవ అంతా ఎగుడు దిగుడు. బోడు దిగి వంపులోకి వచ్చాడు. మరో దుబ్బ దాటాడు. అదిగో తాటి చెట్టు కనిపిస్తోంది. సగం దూరం వచ్చినట్లే. ఇంకొంచెం దూరం నడిస్తే అంతా తాటి వనమే. ఆ తాటి చెట్లు దాటితే ఊరు. ఆ చెట్లల్లోనే తమ ఊరి బొందలగడ్డ. అక్కడ రాత్రిళ్లు దెయ్యాలు తిరుగుతుంటాయంటారు. అప్పుడప్పుడు పగలు కూడా కనిపిస్తాయంటారు. రాత్రిళ్లు ఈ దారి వెంట రావడానికి సాహసించరు. జూలూరులో పడుకుని ఉదయం లేచి వస్తారు.

శ్రీధర్‌కి దెయ్యాలంటే నమ్మకం లేదు. చిన్నతనంలో ప్రాథమిక విద్య ఈ ఊళ్లోనే చదివాడు. అప్పుడు తనింటిముందు అరుగుమీద నిల్చొని పెరటి గోడ పైనుండి ఈ తాటివనంలోకి చూసేవాడు. అక్కడ కదిలే నిప్పును చూసి అదేంటని తల్లిని అడిగితే, దెయ్యం కొరకాసు పట్టుకుని తిరుగుతుందని అమ్మ చెప్పేది. తాను పైచదువులకు పట్నం వెళ్లి గ్రంథాలయాల్లో, పత్రికల్లో హేతువాద సాహిత్యం అభ్యసించాక దెయ్యాలు, చేతబడులు, మంత్రాలు ఉండవని ప్రగాఢంగా విశ్వసించాడు. ఆ అవగాహనతోనే చిన్న వయసు అయినా ధైర్యంగా, ఒంటరిగా వస్తున్నాడు.

ఈ రాత్రిళ్లు నిశ్శబ్ద వాతావరణంలో చుట్టపక్కల ఏ జీవి కదిలినా, ఆకుల శబ్దం వచ్చినా, ఏ ఇతర శబ్దాలకూ భయపడకుండా నడక సాగిస్తున్నాడు. తాను ఉత్తరం నుండి దక్షిణానికి పయనిస్తున్నాడు. కుడిచేతి వైపు ఎత్తైన గడ్డ. అట్నుండి గాలి వీస్తోంది. చిత్ర విచిత్ర శబ్దాలు... వెన్నెల లేని రాత్రి, చుక్కల కాంతిలో కాలి బాట స్పష్టంగానే కనిపిస్తోంది. కీచుమంటున్న శబ్దాలు... చేను కోసిన చెల్క, కదిలే ఎండుటాకులు... ఏదో ప్రాణి కదులుతున్నట్లు భ్రమ. రెండు చెల్కల మధ్య సరిహద్దు గట్టు, చిన్న చిన్న పొదలు. చుక్కల కాంతిలో దెయ్యమే అని దడుచుకునేటట్లుగా ఉందా పొద. మంగ పొదనో, పరికిపొదనో అని అంచనా వేసుకున్నాడు. గాలికి కొట్టుకొచ్చి ఆ పొదల్లో చిక్కిన ఎండుటాకులు కావచ్చు. అటూ ఇటూ కదుల్తూ వింత శబ్దాలు వినిపిస్తున్నాయి. దెయ్యాలు లేకపోయినా పాములు మాత్రం తిరగొచ్చు. దారి చూసుకుంటూ అడుగులు వెయ్యాలి. తాటి చెట్లు దాటాడు. ఆ దరిదాపుల్లో చెట్లు లేవు. పంట చేలు కూడా లేవు.

పొనాది రానే వచ్చింది. జూలూరు నుండి రెండొంతుల దూరం వచ్చాడు. తన వూరు చేరుకోవాలంటే ఇంకోవంతు దూరం నడవాలి. పశువులు చేలు తొక్కకుండా రెండు వైపులా రాళ్లను పేర్చి గోడ కట్టారు. గూడెం నుండి బూడిద గుట్ట దగ్గరికి పశువులను మేతకు తోలడానికి ఊరుమ్మడిగా ఏర్పాటు చేసుకున్నదే ఈ పొనాది.

జగత్పల్లికి వెళ్లే కాలి బాటకు అడ్డంగా ఉంటుంది ఈ పొనాది.

◆◆◆

ఓసారి నర్సింహులు బావ తమ ఊరికి వస్తున్నాడు. చీకట్లో ఎటు వెళ్తున్నాడో అర్థం కాలేదు. దారి తప్పిపోయాడు. చీకట్లో అడవైనా, చెల్క అయినా ఒకటే. చాలా దూరం నడిచాక మర్రి చెట్టుని గుర్తించాడు. అయితే అది తన అత్తగారింటికి వెళ్తుంటే కుడి చేతివైపుండాలి. కానీ ఎడమచేతి వైపుంది. అంటే అటు తిరిగి, ఇటు తిరిగి తాను వెళ్లాల్సిన దారిలోనే తిరుగు ప్రయాణం చేస్తున్నాడు. చివరికి దారి తప్పానని తెలుసుకుని అక్కడే నిద్రపోయాడు. తెల్లారిన తర్వాత తిరుగు ప్రయాణమయ్యాడు. దానికి తనను దెయ్యం దారి తప్పించిందని, రాత్రంతా ఆ చెల్కలోనే తిప్పించిందని, తెల్లవారుజామున మర్రి చెట్టుదగ్గర వదిలేసిందని చెప్పుకొచ్చాడు.

బావ అనుభవాన్ని గుర్తుతెచ్చుకున్నాడు శ్రీధర్. జాగ్రత్తగా తెట్టె గోడ ఎక్కి పొనాదిలోకి దిగాడు. ఓ పది అడుగులు వేశాడు. బాగా గుర్తు. పెద్దసీతాఫలం చెట్టు పక్కనుండి దారి ఉంటుంది. చీకట్లో ఆ చెట్టును గుర్తించి పొనాదిలోంచి తెట్టెను ఎక్కి దిగాడు. సరైన దారిగుండానే వస్తున్నానా అని ఓ సారి చుట్టూ చూసుకున్నాడు. దుక్కిదున్నిని బీడు నేల, పశువుల మేతకు వదిలిన చెల్క కనిపించాయి. సరైన దారిలోనే వస్తున్నానుకుని నడక సాగించాడు. ఎడమవైపు చిన్న రాతిగుండు. దాని చుట్టూ వంపు తిరుగుతుంది కాలిబాట. కొద్ది దూరం వెళ్తే కుడివైపు మరో గుండు. అక్కడ కూడా దారి వంపు తిరుగుతుంది. ఫర్లాంగు దూరంలో తాటివనం. ఎత్తైన తాటి చెట్లు ఆకాశంలోకి నిటారుగా ఉంటాయి. దాని పక్కనే ఊరి పొలిమేర. ఊరికి ఉత్తరంగా నిప్పు కొరకాసు పట్టుకుని దెయ్యం తిరిగే చోటుగా ఆ ప్రదేశానికి బాగా పేరు. అయితే ఏంటి?

పొలిమేర దాటి కొద్దిగా ముందుకు వస్తే గూడెం నుండి ఒక దారి, జూలూరు నుండి తాను నడిచి వచ్చిన మరోదారి. ఈ రెండు దారులు కలిసి మూడుగా విడిపోతుంది. కుడిచేతి వైపున్న దారి ఊరబావి గడ్డమీది నుండి, గుడి ముందు నుండి ఊళ్లోకి ప్రవేశించే మార్గం. నడిమి దారి బొందల గడ్డ బావి పక్కనుండి ఊళ్లోకి వెళ్లే మార్గం. పూర్తిగా ఎడమవైపు చిక్కటి తాటి వనంలోంచి శ్మశానం పక్కనుండి ఊళ్లోకి వెళ్తుంది. పెద్ద పలుగు దాటేసి పోవడమే. పగలు కూడా అటువైపు వెళ్లరు.

యాదగిరిది ఊరికి దక్షిణంగా ఉన్న పొలం. చెల్క ఉన్న రైతు. అతనికి ఈ దారులు బాగా తెలీదు. ఆయన ఇల్లు తూర్పువైపు ఉంది. మధ్య దారి నుండి వెళ్లాల్సిన వాడు తూర్పుదారికి మళ్లాడు ఓ రాత్రి. తాటి తోపు, వంపూ దాటేసి పెద్ద పలుగు ఎక్కేశాడు. చెల్కల్లో చెట్లు, పుట్టలూ తిరిగి దారి తప్పాడు. పలుగు ఎక్కినవాడు వెనుదిరిగే ధైర్యం చెయ్యలేక పశువుల దొడ్లో గడిపి తెల్లారాక ఊరు చేరుకున్నాడు. దెయ్యమే తనను అలా తోలుకపోయిందంటాడు.

యాదగిరి అనుభవం గుర్తు చేసుకున్నాడు శ్రీధర్. ఊళ్లో ఉన్న తన ఇంటికి పడమటి దారే దగ్గరి దారి. ఆ దారి పట్టాడు. ఊరబావి గడ్డ వచ్చేసింది. బావిగడ్డ దాటితే గుడి. ఊరొచ్చేసినట్లే. ఊళ్లోకి వచ్చేశాడు. ఇళ్ల తలుపులన్నీ మూసేసేవున్నాయి. వీధి దీపాలు లేవు. మొరిగే కుక్క తనని గుర్తించిందేమో ఊరకుండిపోయింది. ఐదారుసార్లు పిలిచాక గానీ తన ఇంటి తలుపు తెరుచుకోలేదు.

◆◆◆

తెల్లారి బారెడు పొద్దెక్కింది. శ్రీధర్ వీధి అరుగుమీద కూర్చున్నాడు. అతని కన్నా ముందే మేల్కొన్న అతని తల్లి తన కొడుకు ఎంత ధైర్యవంతుడో అనుకుంది. దెయ్యాలు తిరిగే దారెంట తన కొడుకు క్షేమంగా ఇల్లు చేరాడని ఊరంతా చాటింపు వేసింది. చిన్న వయసులోనే ఇంత తెగింపా, ధైర్యమా అని ఊరంతా ఆశ్చర్యపోయారు.

అలా ఆశ్చర్యపోయిన మల్లయ్య శ్రీధర్ ఇంటికి వచ్చాడు. మల్లయ్య పిరికివాడు. చీకటిపడితే ఊరు దాటడు. "రాత్రి జూలూరు నుండి ఒక్కడివే వచ్చావంట. అదీ చిమ్మ చీకట్లో. దెయ్యం నిన్నేం చెయ్యలేదా? ఆ దారంట చీకట్లో క్షేమంగా వచ్చినవాడివి నువ్వొక్కడివే తెలుసా?" అన్నాడు.

"దెయ్యం ఉంటేగా భయపడడానికి" అంటుండగానే ఇరుగు, పొరుగు ఇంటిముందు చేరారు.

"ఎంత ధైర్యం ఈ పిల్లాడికి?"

"ధైర్యంగా ఉండేవాళ్ల దగ్గరికి దెయ్యాలు రావు"... ఇలా తలా ఓ రకంగా అంటున్నారు.

"గింజలు అమ్మిన పైకం జేబులో పెట్టుకున్నావు కదా. దొంగల భయం కూడా వేయలేదా శ్రీధర్?" బడి పంతులు అడిగాడు.

"దెయ్యాలుండవు. మీరు చెప్పినా నేను నమ్మను. మీలో ఎవరైనా దెయ్యాన్ని చూశారా. నీడల్ని, పొదల్ని చూసి, గాలి చేసే శబ్దాలకి భయపడి దెయ్యమనుకున్నారు. ఇక దొంగల భయమంటారా? ఆ తోవ వెంట పగటి పూటే ఎప్పుడో కానీ మనుషులు తిరగరు. ఇంక రాత్రి పూటేం వస్తారు? ఒకవేళ వచ్చినా డబ్బు జేబులో పెట్టుకుని వస్తాడనుకుంటారా? ఆ దారెంట కాపు కాయడం వృథా శ్రమని ఏ దొంగా మాటు వేయడు" అని వివరించాడు శ్రీధర్.

"నేను కూడా దెయ్యాలు, భూతాలు ఉండవని పుస్తకాల్లో చదివాను. కానీ ఎందుకో నీలా గట్టి అభిప్రాయానికి రాలేకపోయాను. నీ విశ్లేషణ, ఆచరణ నాకు బాగా నచ్చింది బాబూ. చీకటి దెయ్యానికి నువ్వే పరీక్ష పెట్టినట్లుంది" అంటూ శ్రీధర్‌ని అభినందించాడు పంతులు.

★

హ్హా... హ్హా... అపార్ట్‌మెంట్ మీటింగ్

(ఒక అపార్ట్‌మెంట్‌లో చాలా రోజుల తరువాత అసోసియేషన్ మీటింగ్ జరిగింది. కార్యదర్శి చెప్పిందే చెప్పి విసిగించటంతో పెద్ద మొత్తంలో బకాయిలున్నవారు మినహా అందరూ లేచిపోయారు. చాలా సేపటికి గాని అతనా విషయం గుర్తించలేదు)

కార్యదర్శి : సారీ చాలా సేపు మాట్లాడినట్లున్నాను, నా గడియారం ఇంట్లో మరిచిపోయాను, టైమెంతైందో ఎవరైనా చెప్పండి అన్నాడు.

ఓ వ్యక్తి : (వెనుక నుంచి) మీ పక్కనే కాలెండర్ ఉంది చూడండి.

- సత్య





ఇవాళ నేరు చిత్రాలతో పోటీపడడమే కాక, కొన్నిసార్లు ప్రచారంలో, రిలీజులో వాటిని అధిగమించే ప్రమాదంగా కూడా హాలీవుడ్ చిత్రానువాదాలు పరిణమించాయి. ఈ ఏడాది ఇంత వరకు ఘన విజయం సాధించిన తెలుగు చిత్రాలంటే నేరు చిత్రాల కన్నా తమిళం నుంచి వచ్చిన జీవా 'రంగం', లారెన్స్ 'కాంచన', ఇంగ్లీషు నుంచి వచ్చిన 'కరీబియన్ సముద్రపు దొంగలు - రాకాసి అలలు' లాంటి డబ్బింగ్‌లే చటుక్కున గుర్తుకొచ్చే పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో హాలీవుడ్ చిత్రసీమ, మన భారతీయ పరిశ్రమపై మున్నెన్నడూ లేనంతగా దృష్టి పెడుతోంది. ఆ అంశాలపై ఈ వారం ఫోకస్...

భారతీయ మార్కెట్‌పై హాలీవుడ్ చూపు

ఇటీవల విజయవాడ ఐ-నాక్స్ మల్టీప్లెక్స్ థియేటర్ (ఊర్వశి, మేనక థియేటర్ల కాంప్లెక్స్ కొత్త రూపం)లో 'పైరేట్స్ ఆఫ్ ది కరీబియన్' సిరీస్‌లోని నాలుగో భాగమైన 'పైరేట్స్ ఆఫ్‌ది కరీబియన్ - ఆన్ స్ట్రేంజర్ టైడ్స్' ఆంగ్ల చిత్రం ప్రదర్శితమైంది. అదే సమయంలో ఊళ్ళో ఆంగ్ల చిత్రాలకు సుప్రసిద్ధమైన మరో థియేటర్ నవరంగ్‌లో 'రాకాసి అలలు' అని పేరు పెట్టి, అదే ఆంగ్ల చిత్రం తాలూకు తెలుగు అనువాదాన్ని ప్రదర్శిస్తున్నారు. గమ్మత్తేమిటంటే, ఆ చిత్రం ఇంగ్లీషు వెర్షన్ కన్నా తెలుగు డబ్బింగ్ చూడడానికే జనం ఎగబడ్డారు. ఇప్పటికే మొదటి మూడు భాగాలూ హిట్టవగా, ఈ నాలుగో భాగం తెలుగు అనువాదం ఆరంభ వసూళ్ళు మొన్న మే నెలలో నేరు తెలుగు చిత్రాల కన్నా ఎక్కువ ఉండడం విశేషం. పైపెచ్చు, ఇంగ్లీషు వెర్షన్ వేస్తున్న హాలులో వసూళ్ళు ఓ మాదిరిగా ఉంటే, తెలుగు డబ్బింగ్ నడుస్తున్న హాలు ఆగకుండా 'హౌస్‌ఫుల్' అవుతూ వచ్చింది. చివరకు అసలు సినిమా కన్నా అనువాద సినిమాకే ఎక్కువ డబ్బులొచ్చాయి! "మారుతున్న ధోరణికి ఇది ప్రతీక" అని సినీ వ్యాపార, ప్రచార రంగాల్లో సుదీర్ఘ అనుభవం ఉన్న కాట్రగడ్డ నరసయ్య వ్యాఖ్యానించారు.

ప్రాంతీయ భాషల్లో పలకరింపు

నిజమే! ఇవాళ ధోరణి మారింది. భారతదేశంలోని వివిధ ప్రాంతాలు, భాషలకు చెందిన ప్రేక్షకులు తమకు మహారాజ పోషకులని అక్కడి వారు గుర్తించారు. అందుకే, ఆయా ప్రాంతీయ ప్రేక్షకులకు అర్థమయ్యేలా హాలీవుడ్ చిత్రాల్లోని అత్యధిక భాగం ఇవాళ ఇంగ్లీషుతో పాటు, తెలుగు, తమిళ, హిందీ భాషల్లోనూ పలకరిస్తున్నాయి. వెరసి, ఇంగ్లీషు సినిమా అనువాదాల వ్యాపారం కోట్లలోకి వెళ్ళింది. గమనిస్తే, గడచిన దశాబ్దిన్నర పైచిలుకు కాలంలో ఈ వ్యాపారం తెలుగు చిత్ర పరిశ్రమ ధోరణిని మార్చేసింది. హిందీ నుంచి తెలుగులోకి వచ్చిన 'మైనే ప్యార్ కియా' (తెలుగులో 'ప్రేమపావురాలు') లాంటి మన చిత్రాలకు సమానంగా మ్యూజికల్ హిట్లయ్యాయి. 'జురాసిక్ పార్క్', 'మమ్మీ' లాంటి చిత్రాల తెలుగు అనువాద రూపాలతో డబ్బింగ్ మరో కొత్త దశకు చేరింది. హాలీవుడ్‌లోని ప్రతి భారీ ఆంగ్ల చిత్రం ఇవాళ ఆంగ్లంతో పాటు ఏకకాలంలో ప్రాంతీయ భాషల్లోనూ విడుదలవడం మొదలైంది. దీంతో మారుమూల ప్రాంతాల ప్రేక్షకులు సైతం ఇంగ్లీషు చిత్రాల తెలుగు అనువాద రూపాలతో హాలీవుడ్ సాంకేతిక పరిజ్ఞానానికి సుపరిచితులవుతున్నారు. ఈ ధోరణి ఒక్క తెలుగులోనే కాక, దేశవ్యాప్తంగా కనిపిస్తోంది. దాంతో, చివరకు ఆయా ప్రసిద్ధ చిత్రాలను టీవీలో ప్రీమియర్ ప్రదర్శనలిస్తున్నప్పుడు కూడా భారీ హంగామా చోటు చేసుకుంటోంది. ఉదాహరణకు, జేమ్స్ కామెరాన్ 3డి చిత్రం 'అవతార్'ను భారతదేశంలో టీవీలో ఆ మధ్య ప్రదర్శిస్తున్నప్పుడు స్టార్ నెట్‌వర్క్ చేసిన హంగామా అంతా ఇంతా కాదు. ప్రధాన కూడళ్ళలో ఆ చిత్ర కటౌట్లు, హోర్డింగులు పెట్టింది. మునుపెన్నడూ ఏ హాలీవుడ్ చిత్రం టీవీలో ప్రసారమైనప్పుడూ ఇంత హడావిడి జరగలేదు. స్పాన్సరింగ్ ప్రయోజనాలు ముడిపడి ఉండడం అందుకు ఓ ప్రధాన కారణం. భారతదేశంలో హాలీవుడ్ చిత్రాలు ఎంత లోతుగా చొచ్చుకుపోయాయో చెప్పడానికి ఇది ఓ ఉదాహరణ.

హాలీవుడ్‌కు అనువైన మార్కెట్

నిజానికి, 2009 చివరలో 'అవతార్' చిత్రం భారతదేశంలో దాదాపు 700 హాళ్ళలో విడుదలైంది. ఒక్క మన దేశంలోనే ఆ చిత్రం సుమారు రూ. 140 కోట్లు ఆర్జించినట్లు చెబుతున్నారు. మునుపెన్నడూ ఏ హాలీవుడ్ చిత్రమూ భారతదేశంలో ఇంత మొత్తం వసూలు చేయలేదు. ఇవాళ భారతదేశం, హాలీవుడ్ చిత్రాలకు శరవేగంతో పెరుగుతున్న మార్కెట్ అనడానికి ఈ 'అవతార్' చిత్రమే ఉదాహరణ అని 'ఫాక్స్ స్టార్ స్టూడియో' సి.ఇ.ఓ. విజయ్ సింగ్ లాంటి వారు అంటున్నారు. "ప్రపంచవ్యాప్తంగా 'అవతార్' మొత్తం వసూళ్ళలో భారతదేశపు 'ఫాక్స్ ఇండియా' 13వ స్థానంలో నిలిచింది" అని ఆయన ఆ మధ్య వెల్లడించారు. ఒక్క 'అవతా'రే కాదు, 'ప్రిడేటర్స్', 'క్రానికల్స్ ఆఫ్ నార్నియా', '127 అవర్స్', 'ఎక్స్ మెన్ - ఫస్ట్ క్లాస్' లాంటి పలు చిత్రాల భారతదేశ వసూళ్ళలో కూడా ఈ సంస్థ ప్రపంచంలోని అగ్రశ్రేణి అంతర్జాతీయ మార్కెట్లలో స్థానం సంపాదించుకుంది. హాలీవుడ్ చిత్రాల 'వార్నర్ బ్రదర్స్' సంస్థ సైతం, ముఖ్యంగా 'హ్యారీ పోటర్' బ్రాండ్‌తో గడచిన కొన్నేళ్ళలో భారత్‌లో ఇబ్బడిముబ్బడిగా ఆదాయం పెంచుకుంది. ఉదాహరణకు, 2002లో 'హ్యారీ పోటర్' సిరిస్‌లో తొలి చిత్రం భారత్‌లో కేవలం 101 ప్రింట్లతో విడుదలైంది. బాక్సాఫీస్ వద్ద రూ. 10 కోట్ల గ్రాస్ సాధించింది. కానీ, 'హ్యారీ పోటర్ 7' విడుదలయ్యేసరికి పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఆ ఏడవ చిత్రంలో కూడా ఒక భాగం 2010లో, మరో భాగం ఈ ఏడాది జులైలో వెయ్యికి పైగా ప్రింట్లతో విడుదలయ్యాయి. అవి కనీసం రూ. 75 కోట్ల దాకా వసూలు చేసినట్లు అంచనా. అంటే తొమ్మిదేళ్ళలో ఏడున్నర రెట్లు వసూళ్ళు పెరిగాయన్న మాట! ఈ పరిస్థితుల్లో ఒక్క వార్నర్ సంస్థే ఈ ఏడాది 15 చిత్రాలు విడుదల చేసింది.

బాక్సాఫీస్ వద్ద పెరుగుతున్న వాటా

లెక్క చూస్తే, భారతదేశపు బాక్సాఫీస్ వసూళ్ళలో ఒకప్పుడు హాలీవుడ్ చిత్రాల మొత్తం వాటా 5 శాతమే. ఇప్పుడది 9 శాతానికి పెరిగింది. దీనికి ప్రాంతీయ భాషల్లో డబ్బింగ్ ప్రధానంగా దోహదం చేసింది. నాణ్యమైన వినోదానికి చిరునామాగా నిలిచి, ప్రాంతీయ భారతీయ భాషా ప్రేక్షకుల్లో అంతకంతకూ ఆకర్షణ పెంచుకుంటున్న

ఈ చిత్రాలతో ఈ వసూళ్ళ వాటా మరింత పెరగడం ఖాయం. 3డి రూపంలో చిత్ర ప్రదర్శన, దూకుడుగా సాగిస్తున్న మార్కెటింగ్, పంపిణీల వల్ల ఈ సినిమాలు దేశం నలుమూలల్లో జనంలోకి చొచ్చుకుపోతున్నాయి. అయితే, భారత్‌లో రూ. 250 కోట్ల పైగా వసూలు చేసిన '3 ఇడియట్స్', 'గజిని' లాంటి చిత్రాలతో పోలిస్తే, ఈ ఇంగ్లీషు చిత్రాల మార్కెట్ ఇంకా పెరగాల్సి ఉంది. పైగా, ఈ ఆంగ్ల చిత్రాలను భారతీయ ప్రేక్షకులు ఆదరిస్తున్నప్పటికీ, అన్ని సినిమాలూ 'అవతార్' లాగా రూ. 140 కోట్లు వసూలు చేయడం లేదన్నది నిజం. ఏమైనా, ప్రాంతీయ భాషల్లోకి అనువదించడం మొదలుపెట్టి, సబ్ టైటిళ్ళతో సైతం అందుబాటులోకి తెచ్చాకనే ఇంగ్లీషు చిత్రాల వసూళ్ళు పెరిగాయని మార్కెట్ వర్గాలు అంగీకరిస్తున్నాయి. 'రియో', 'హ్యారీ పోటర్ అండ్ ది డెత్లీ హ్యాలోస్ -2', 'పైరేట్స్ ఆఫ్ ది కరీబియన్', 'కుంగ్ ఫూ పాండా 2' లాంటి కొన్ని చిత్రాలు ఈ రకమైన మార్కెటింగ్ ఫార్ములాతో విజయవంతమయ్యాయి.

పట్నాల్లోనూ ఆంగ్ల చిత్ర అనువాదాలు

పరిస్థితి ఇప్పుడు ఎంత దాకా వచ్చిందంటే - ముఖ్యమైన హాలీవుడ్ చిత్రాలను భారతదేశంలో విడుదల చేసే ఏ స్టూడియో అయినా సరే, ఆర్థికంగా గరిష్ఠ స్థాయిలో సత్తా చాటాలంటే ప్రాంతీయ భాషల్లో డబ్బింగ్ చేయడం తప్పనిసరిగా మారింది. అందుకే, ఒకప్పుడు ఇంగ్లీషు సినిమా అంటే పెద్ద నగరాలకే పరిమితం. కానీ, ఇవాళ గమనిస్తే విజయవాడ, విశాఖపట్నం లాంటి నగరాల్లోనే కాక, గుడివాడ, తెనాలి, నరసరావుపేట లాంటి ఊళ్ళలోనూ ఈ హాలీవుడ్ చిత్రాలు అనువాదరూపంలో పలకరిస్తున్నాయి. జనాకర్షక అంశాలు ఏ మాత్రం ఉన్నా విజయవంతమవుతున్నాయి. "ఇటీవల భారతదేశంలో విజయవంతమైన వివిధ హాలీవుడ్ చిత్రాలను బట్టి చూస్తే, కేవలం నగరాల్లోనే కాక, ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లో సైతం సరైన సినిమాల కోసం ప్రేక్షకులు ఆవురావురుమంటున్నారని అర్థమవుతోంది" అని 'డ్రీమ్ వర్క్స్' వారి చిత్రాలన్నిటినీ భారత్‌లో మార్కెట్ చేసి, పంపిణీ చేస్తున్న 'రిలయన్స్ ఎంటర్‌టైన్‌మెంట్' సి.ఇ.ఒ. సంజీవ్ లాంబా పేర్కొన్నారు. ప్రతి ఏటా కనీసం 10 హాలీవుడ్ చిత్రాలను మార్కెటింగ్, పంపిణీ జరపాలని రిలయన్స్ ఎంటర్‌టైన్‌మెంట్ భావిస్తోంది.

పైగా, తెలుగునాట హీరోలు పరిమిత సంఖ్యలోనే సినిమాలు చేస్తుండడంతో, జనాకర్షణ అధికంగా ఉండే భారీ తెలుగు చిత్రాల విడుదల ఏటా చాలా తక్కువే! దాంతో, ఇటు థియేటర్లలో ప్రదర్శించడానికి తగిన సంఖ్యలో సినిమాల కోసం, అటు జనాకర్షణ కోసం ఈ భారీ ఆంగ్ల అనువాదాలపై మన ఎగ్జిబిటర్లు ఆధారపడుతున్నారు. సినిమాకున్న క్రేజును బట్టి ఒక ఊళ్ళో రెండు మూడు హాళ్ళలో విడుదల చేస్తున్న సందర్భాలూ ఉన్నాయి. ఇక, మద్రాసు లాంటి మహానగరాల్లో సైతం ఇంగ్లీషు మాతృకతో పాటు, మరోపక్క ప్రాంతీయ భాషలో దాని డబ్బింగ్ కూడా పలు హాళ్ళలో విడుదల అవుతోంది.

ఆసక్తి పెంచిన టీవీ - అండగా డిజిటల్ ప్రదర్శన

వెరసి, భారత్‌లో హాలీవుడ్ చిత్రాల మార్కెట్ గణనీయంగా మారిపోయింది. ఒకప్పుడు పరిమిత సంఖ్యలో విడుదలవుతూ వచ్చిన ఈ చిత్రాలు ఇప్పుడు భారీ సంఖ్యలో, విస్తృతంగా రిలీజవుతున్నాయి. "రెండు, మూడు ప్రింట్లతో సినిమా రిలీజ్ చేసే రోజుల నుంచి ఇవాళ '2012' లాంటి వాటిని 800కు పైగా ప్రింట్లతో జనం ముందుకు తెచ్చే దశకు వచ్చాం" అని 'సోనీ పిక్చర్స్ ఇండియా' మేనేజింగ్ డైరెక్టర్ కెర్సీ దారూవాలా అన్నారు. భారతదేశంలో అత్యధిక కాలంగా గత 76 ఏళ్ళుగా నడుస్తున్న హాలీవుడ్ చిత్ర సంస్థ 'సోనీ పిక్చర్స్'లో గత 30 ఏళ్ళుగా పనిచేస్తున్న సుదీర్ఘ అనుభవం ఆయనది. ఆయన చెప్పినట్లు, ఇటీవలి '2012' లానే, 'ది ఎమేజింగ్ స్పైడర్‌మ్యాన్', 'ది ఎడ్వంచెర్స్ ఆఫ్ టిన్‌టిన్', 'మెన్ ఇన్ బ్లాక్ 3' లాంటివి కూడా భారీగా విడుదల కానున్నాయి. చిత్ర ప్రదర్శనలోనూ ఇటీవల డిజిటల్ సాంకేతిక పరిజ్ఞానం వచ్చేయడం ఈ వ్యవహారాన్ని సులభతరం చేసింది. ఇవాళ విజయవాడ నడిబొడ్డులోని ప్రధాన థియేటర్లలోనే కాదు, పోరంకి, కంకిపాడు, నిడమానూరు లాంటి శివారు ప్రాంతాల్లో సైతం రీలు బాక్సులతో పని లేకుండా, డిజిటల్ పద్ధతిలో చిత్రాల ప్రదర్శన సాగుతోంది. "ఫలితంగా, హాలుకు ఓ ప్రింట్ తీయాల్సిన ఖర్చు, శ్రమ తప్పాయి. 'యు.ఎఫ్.ఒ', 'క్యూబ్' లాంటి సంస్థలు డిజిటల్ పద్ధతిలో ప్రసారాలు చేస్తుంటే, హాలులో సినిమా ప్రదర్శితమవుతోంది. ఇది డిస్ట్రిబ్యూటర్‌కూ, ఎగ్జిబిటర్‌కూ - ఇద్దరికీ సులువుగా మారింది" అని కాట్రగడ్డ నరసయ్య వివరించారు. దీనికి తోడు, దాదాపు 2009 నుంచి ఉపగ్రహ తెలుగు టీవీ చానళ్ళు సైతం ఆంగ్ల చిత్రాల అనువాదాలను క్రమం తప్పకుండా ప్రసారం చేస్తున్నాయి. అది కూడా ఈ చిత్రాల పట్ల సామాన్య జనంలో ఆసక్తిని పెంచి పోషించింది. దాంతో, హాలీవుడ్ చిత్రాలను సైతం తనకు అర్థమయ్యే ప్రాంతీయ భాషల్లో దిగువ తరగతి ప్రేక్షకులు సైతం హాయిగా చూసి, ఆనందిస్తున్నారు.

స్వదేశీ మార్కెట్‌తో సమప్రాధాన్యం

ఇంకా విశేషం ఏమిటంటే, చాలా వరకు హాలీవుడ్ చిత్రాలు అమెరికాలో రిలీజవుతున్న రోజే ఇక్కడా మన ముందుకు వచ్చేస్తున్నాయి. స్టీవెన్ స్పీల్‌బర్గ్ చిత్రం 'ది ఎడ్వంచెర్స్ ఆఫ్ టిన్‌టిన్' అయితే, ఏకంగా అమెరికాలో విడుదల కన్నా ఆరు వారాల ముందరే మన దేశంలో రిలీజవుతోంది. ఇక్కడ 'టిన్‌టిన్'కు బోలెడంతమంది అభిమానులు ఉండడం కూడా అందుకు కారణం. మరోపక్క మన సినీ విపణి సత్తాను గ్రహించిన ప్రసిద్ధ హాలీవుడ్ స్టూడియో సంస్థలు, ఆకర్షణీయమైన భారతీయ చిత్రాల విడుదలలో కూడా భాగస్వాములవుతున్నాయి. 2007లో సోనీ పిక్చర్స్ సంస్థ 'సావరియా' చిత్రంతో జత కట్టింది. ఆ చిత్రం ఘోర పరాజయం పాలైనప్పటికీ, వెనక్కి తగ్గకుండా మంచి ప్రాజెక్టుల కోసం చూస్తోంది. ఇటీవలే 'వయాకామ్ 18 మోషన్ పిక్చర్స్' సంస్థ 'బుడ్డా హోగా తేరా బాప్', 'తను వెడ్స్ మను', 'సైతాన్' చిత్రాల విడుదలలో తానూ భాగమైంది. వెలికిరాని భారతీయ మార్కెట్ సత్తాను వినియోగంలో పెట్టడం ఇప్పుడు విదేశీ స్టూడియో సంస్థలకు తప్పనిసరి అయింది. నిజం చెప్పాలంటే, వివిధ హాలీవుడ్ స్టూడియో సంస్థల కార్యాలయాలు భారత్‌లో చాలా ఏళ్ళుగా ఉన్నాయి. చిత్ర నిర్మాణ, పంపిణీ విభాగాల్లో స్థిరపడ్డాయి. అందుకే అవి భారతీయ చిత్రాల నిర్మాణ, పంపిణీ సంస్థలతో జత కడుతూ, తమ సొంత చిత్రాలను కూడా ముందుకు తీసుకువెళుతున్నాయి. అలాగే, భారతీయ సంస్థల చిత్రాల్లో కొన్నింటికి సహ - నిర్మాతలుగా వ్యవహరిస్తున్నాయి. ఆ రకంగా భారతీయ చిత్ర పరిశ్రమతో పెనవేసుకోవాలని భావిస్తున్నాయి. అతి పెద్ద మార్కెట్లలో భారత్ ఒకటని గ్రహించిన ఈ హాలీవుడ్ సంస్థలు తమ స్వదేశీ మార్కెట్‌తో సమానంగా భారతీయ మార్కెట్‌కు కూడా ప్రాధాన్యమిస్తున్నాయి. పైపెచ్చు, రాగల అయిదేళ్ళలో భారతీయ సినిమా మార్కెట్ గణనీయంగా పెరుగుతుందని ఓ అంచనా. అందుకే, స్వదేశీ మార్కెట్ మందగిస్తూ, భారతీయ మార్కెట్ పెరుగుతున్న ప్రస్తుత సమయంలో హాలీవుడ్ మన వైపు చూడడం అర్థం చేసుకోదగిన పరిణామమే! మనది ఇప్పటికీసామాన్య ప్రజానీకం సినీ వినోదం మీద ఎక్కువగా ఆధారపడే దేశమే! అది తమకు ఓ పెద్ద సానుకూల అంశమని హాలీవుడ్ సంస్థలు భావిస్తున్నాయి. స్థానిక బాలీవుడ్ చిత్రాల విడుదల తేదీలకు భిన్నంగా, సరైన సమయంలో తమ చిత్రాలను విడుదల చేయడం మాత్రం హాలీవుడ్‌కు ఓ సవాలు. అలాగే, హాలీవుడ్‌తో పోలిస్తే భారత జనాభాకున్న హాళ్ళ సంఖ్య ఇప్పటికీ తక్కువే. కాబట్టి, వీలైనన్ని ఎక్కువ రోజులు చిత్రం జనానికి అందుబాటులో ఉంచేలా చూడడం కొద్దిగా కష్టమే. ఇలాంటి ఇబ్బందులు ఉన్నప్పటికీ, పెరుగుతున్న ప్రాంతీయ ప్రేక్షకాదరణ, 3డి రూపంలో చిత్రాల ప్రదర్శన, క్రమంగా ఎక్కువవుతున్న మల్టీప్లెక్సుల సంస్కృతి - ఇవన్నీ హాలీవుడ్‌కు సానుకూల అంశాలు. అందుకే, భారత్‌లో మన చిత్ర పరిశ్రమతో హాలీవుడ్ స్నేహం అసహజం కాదు కదా, అనివార్యమని తాజా పరిణామాలు సూచిస్తున్నాయి.

- రెంటాల జూనియర్

టెక్నాలజీ దిగ్గజం యాపిల్ కంప్యూటర్స్ ప్రపంచంలోనే అతిపెద్ద కార్పొరేషన్‌గా రూపుదిద్దుకోవడంలో విశేష కృషి సల్పిన వ్యక్తి స్టీవ్‌జాబ్స్. ఆయన పలు రకాల ఆవిష్కరణలు చేశాడు. ఆధునికత, నూతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఐఫోన్, ఐప్యాడ్, ఐపోడ్‌ను అందించాడు. ఆన్‌లైన్ మ్యూజిక్‌లోనూ విప్లవాత్మక మార్పులు తేవడంతో పాటు స్మార్ట్‌ఫోన్, లెడ్ పిక్సర్‌లను ఆవిష్కరించి యాపిల్ ఇన్‌కార్పొరేషన్‌ను ఒంటి చేత్తో నిలబెట్టాడు. 2007లో యాపిల్ కంపెనీకి కీలకంగా భావించే ఐఫోన్ ద్వారా టెక్నాలజీ శకంలో విప్లవం తీసుకొచ్చాడు. ఐఫోన్ ద్వారానే యాపిల్ అతిపెద్ద అమెరికన్ కార్పొరేషన్‌గా అవతరించింది. ఐట్యూన్స్ సాఫ్ట్‌వేర్‌ను, మ్యూజిక్ ప్లేయర్‌ను కనుగొనడం ద్వారా 2000 సంవత్సరంలో దివాలా తీసే స్థితిలో వున్న యాపిల్ సంస్థకు స్టీవ్ తిరిగి ఊపిరిలూదాడు. కంప్యూటర్లు, మ్యూజిక్, మూవీస్, మొబైల్ టెలిఫోన్ల విభాగాల్లో యాపిల్‌ను ఎవరికీ అందనంత ఎత్తుకు చేర్చాడు. ఆర్థిక సంక్షోభం కారణంగా ఏడాదికి ఒక డాలర్ మాత్రమే జీతం తీసుకుని సంస్థను నడిపాడు. అందుకుగాను ఆయనకు చక్కటి గౌరవమే లభించింది. ఫార్చ్యూన్ మేగజైన్ ఆయన్ను ఈ దశాబ్దపు సిఇఒగా ప్రకటించింది. అలాంటి జాబ్స్ ఇప్పుడు యాపిల్ సంస్థకు రాజీనామా చేశారు. ఎందుకో, ఏమిటోతోపాటు ఆయన జీవిత విశేషాలనూ తెలుసుకుందామా!



ఒక్క డాలర్ జీతగాడు!

యాపిల్ సంస్థ సిఇఒ స్టీవ్‌జాబ్స్ మరో 6 వారాలలో చనిపోవచ్చుని, అతనికి క్యాన్సర్ ఉన్నందున ఇంతకంటే ఎక్కువ కాలం బ్రతకలేరని డాక్టర్లు తేల్చి చెప్పినట్టు సమాచారం. స్టీవ్‌జాబ్స్ ఇప్పటికే తన విధులకు హాజరుకావటం లేదు. సంస్థ బోర్డు సభ్యులకు రాసిన లేఖలో తనకు విశ్రాంతి కల్పించవలసిందిగా కోరినట్టు తెలుస్తోంది. అరుదైన క్లోమ సంబంధ క్యాన్సర్‌తో పోరాడుతున్న స్టీవ్ స్థానంలో టిమ్ కుక్ బాధ్యతలు చేపట్టనున్నారు. 2012లో మరిన్ని ఫీచర్లతో కూడిన కొత్త ఐఫోన్‌ను యాపిల్ విడుదల చేస్తుందనే వార్తల నేపథ్యంలో జాబ్స్ రాజీనామా విశ్లేషకులను కూడా ఆశ్చర్యానికి గురిచేసింది.

యాపిల్ ప్రత్యేకత

యాపిల్ సంస్థ ఏదైనా ఒక ఉత్పత్తిని విడుదల చేస్తోందనగానే అది ఏమై వుంటుంది? అది కంప్యూటర్ రంగంలో ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుంది? అని వినియోగదారులు, పరిశీలకులతోపాటు పోటీ సంస్థలు సైతం ఎదురుచూస్తుంటాయి. ఐబిఎం సంస్థ తయారుచేసిన పర్సనల్ కంప్యూటర్లను పోలిన వాటిని తయారుచేయడానికి, దానిపై పనిచేసే సాఫ్ట్‌వేర్లు, ఇతర పరికరాలను తయారుచేయడాకే అంతా ఆసక్తి చూపుతున్న తరుణంలో పూర్తి వైవిధ్యభరితమైన ఆలోచనలతో వేరొక ప్లాట్‌ఫామ్‌ని తయారుచేసి, ప్రపంచానికి అందించిన ఘనత యాపిల్ సంస్థది. 'థింక్ డిఫరెంట్' అనే నినాదంతో ప్రపంచ కంప్యూటర్ చరిత్రలో తన స్థానం నిలుపుకున్న యాపిల్ కంప్యూటర్ సంస్థ ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా నేటికీ సరికొత్త టెక్నాలజీలను అందించే సంస్థగా పేరుపొందింది. ఐబిఎం కంపాటిబుల్ కంప్యూటర్లకు సుమారు దశాబ్దం పూర్వమే జియుఐ (గ్రాఫికల్ యూజర్ ఇంటర్‌ఫేస్) ఆపరేటింగ్ సిస్టమ్‌ని అందించినా, మౌస్ వినియోగాన్ని తొలిసారి రుచి చూపించినా, పిర్ టు పిర్ నెట్‌వర్కింగ్‌ని తొలి కంప్యూటర్‌తోనే అందించినా, తొలి పిడిఎ విడుదలచేసినా, సరికొత్త డిజైన్‌తో ఐమ్యాక్ మోడల్ విడుదల చేసినా, నూతన సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఐఫోన్, ఐప్యాడ్, ఐపోడ్‌లను అందించినా అది ఆ సంస్థకే చెల్లింది.

ఓ అనాథ సిఇఓ అయిన తీరు

ఒక అనాథ బాలుడు, 30 సంవత్సరాల వయసుకే కోటీశ్వరుడై, ప్రపంచ కంప్యూటర్ రంగంలో తనకంటూ ప్రత్యేకస్థానాన్ని లిఖించుకున్నాడు. ఆ పిల్లవాడే స్టీవ్ జాబ్స్ అంటే ఆశ్చర్యం వేస్తుంది. 1955 ఫిబ్రవరిలో జన్మించిన స్టీవ్ పాలిస్‌ను అనాథాశ్రమం నుంచి పాల్ జాబ్స్-క్లారా జాబ్స్ దంపతులు దత్తత తీసుకున్నారు. స్టీవ్ పాల్ జాబ్స్ పేరుతో పెంచి పెద్దచేశారు. కాలిఫోర్నియాలోని లాస్ ఆల్టోస్‌లో 1972లో హైస్కూల్ విద్యనభ్యసించిన జాబ్స్, పోర్ట్‌ల్యాండ్‌లోని రీడ్ కాలేజీలో చేరారు. అయితే జాబ్స్ ఒక సెమిస్టర్ పూర్తికాగానే చదువు మానేశాడు. ఆ తర్వాత ఉద్యోగం కోసం అటారీ ఇన్‌కార్పొరేషన్‌లో చేరిన జాబ్స్, తన చిన్ననాటి స్నేహితుడు స్టీవ్ వోజ్నియాక్‌ని తిరిగి కలుసుకున్నాడు.కంప్యూటర్ సెమినార్లు, క్లబ్బులకు

తొలి యాపిల్ కంప్యూటర్ 2,10,000 డాలర్లు మాత్రమే

ఆ కంప్యూటర్ యాపిల్ ఐపాడ్ కన్నా వెయ్యి రెట్లు నిదానంగా పనిచేస్తుంది. కానీ ధరలో మాత్రం ఐపాడ్ కన్న 425 రెట్లు ఎక్కువగా అమ్ముడైంది. అందుకు కారణం అది యాపిల్ సంస్థ తయారు చేసిన మొట్టమొదటి కంప్యూటర్ కావడమే. 2,10,000 అమెరికన్ డాలర్లు పలికిన ఈ యాపిల్-1 కంప్యూటర్ 1970వ దశాబ్దంలో యాపిల్ సంస్థ ఇలాంటి కంప్యూటర్లను కేవలం 200 మాత్రమే తయారు చేసింది. ప్రముఖ వేలం సంస్థ క్రిస్టీ సెంట్రల్ లండన్‌లో దీనిని వేలం వేయగా.. ఇది 1,33,250 పౌండ్ల (దాదాపు 2,10,000 అమెరికా డాలర్లు) వెల పలికింది. యాపిల్-1ను 1976లో విడుదల చేశారు. ఇది అప్పట్లో పూర్తిగా అసెంబ్లిడ్ మదర్‌బోర్డుతో తయారైన ఒకే ఒక పర్సనల్ కంప్యూటర్ కావడం విశేషం. 1977లో దీని తయారీని నిలిపివేశారు. అప్పటి వరకూ ఇది 666.66 అమెరికా డాలర్లకు అమ్ముడైంది.

ఇద్దరూ తప్పకుండా హాజరయ్యేవారు.

1975లో జాబ్స్ ఇంటిలోని కార్‌గ్యారేజిలో పర్సనల్ కంప్యూటర్లపై పనిచేయసాగారు. ఆ సంవత్సరాంతంలోనే మౌంటెన్‌వ్యూలోని బైట్ షాప్ నుంచి 50 అసెంబుల్డ్ పర్సనల్ కంప్యూటర్లకు ఆర్డర్ వచ్చింది. దీంతో స్టీవ్‌జాబ్స్ మరో ఇద్దరితో కలిసి 1976 ఏప్రిల్ 1న 'యాపిల్ కంప్యూటర్స్'ను స్థాపించాడు. జాబ్స్ తనకు అత్యంత ఇష్టమైన పండు పేరునే కంపెనీ పేరుగా నిర్ణయించుకుని, లోగోలో బైట్‌ని కూడా సూచించడానికిగాను పూర్తి యాపిల్‌ని కాకుండా కొరికిన యాపిల్‌ని ఉపయోగించాడు. అదే సంవత్సరంలో సింగిల్ బోర్డ్ కలిగిన యాపిల్-1 కంప్యూటర్ విడుదల చేశాడు. కేవలం ఆన్‌బోర్డు రామ్ మాత్రమే కలిగివున్న ఈ కంప్యూటర్‌కి వీడియో ఇంటర్‌ఫేస్ (టీవీని మోనిటర్‌గా కనెక్ట్ చేసుకోవడానికి), ఎక్స్‌టర్నల్ ప్రోగ్రామింగ్ ఇంటర్‌ఫేస్ మాత్రమే వుండేవి.

1977లో యాపిల్-2 కంప్యూటర్‌ను విడుదల చేశారు. అత్యధికంగా అమ్ముడుపోయిన తొలి పర్సనల్ కంప్యూటర్ ఇదే. ఆ రోజుల్లోనే యాపిల్-2పై సుమారు 16వేల అప్లికేషన్ ప్రోగ్రామ్‌లు తయారయ్యాయంటే జాబ్స్ ఏ స్థాయిలో ప్రోగ్రామర్లను ఆకట్టుకున్నాడో అర్థం చేసుకోవచ్చు. అదే సంవత్సరం జాబ్స్ వ్యాపార బాధ్యతల నుంచి తప్పుకుని, ఛైర్మన్ బాధ్యతలను ఇంటెల్‌లో మార్కెటింగ్ మేనేజర్‌గా పనిచేసిన మైక్ మార్కులాకు అప్పగించాడు. తను తర్వాతితరం పర్సనల్ కంప్యూటర్ మాకింతోష్ తయారీలో నిమగ్నమయ్యాడు. 1980లో పబ్లిక్ లిమిటెడ్‌గా మారిన యాపిల్, తన యాపిల్-3 మోడల్‌ని విడుదలచేసింది. అయితే దానిలో సమస్యలు రావడంతో మైక్ మార్కులా ఛైర్మన్ పదవినుంచి తప్పుకుని తిరిగి జాబ్స్‌కి అప్పగించాడు. 1983లో యాపిల్ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గది. ఆ సంవత్సరం వీరు తమ మ్యాకింతోష్ కంప్యూటర్‌ను విడుదల చేశారు. నాటికి, నేటికి మ్యాక్ అనే పేరు నూతనత్వానికి, సరికొత్త ప్రయోగాలకు మారుపేరుగా నిలిచిపోయింది. అదే సంవత్సరంలో జాబ్స్ అంతకు పూర్వం తనతో పనిచేసిన జాన్‌స్కల్లీని ప్రెసిడెంట్-సిఇవోగా నియమించాడు. తరువాతి కాలంలో వీరి మధ్య జరిగిన ఆధిపత్యపోరులో మెంబర్లు కూడా జాన్‌స్కల్లీనే సమర్థించడంతో స్టీవ్‌కు యాపిల్‌ను వదలక తప్పలేదు.

అనంతరం 'నెక్స్ట్ సాఫ్ట్‌వేర్' సంస్థని ప్రారంభించాడు. 1986లో జార్జి లూకాస్ నుంచి పిక్సర్ యానిమేషన్ స్టూడియోని కొనుగోలుచేసి, చిత్ర నిర్మాణరంగంలోకి అడుగుపెట్టాడు. 1989లో నెక్స్ట్ అద్భుతమైన కంప్యూటర్‌ని తయారుచేసినప్పటికీ అత్యధిక ధర కలిగిన ఆ కంప్యూటర్ అసలు అమ్ముడుపోలేదు. ఈ ఏడాదే పిక్సర్ నిర్మించిన 'టిన్ టాయ్' యానిమేషన్ చిత్రానికి ఆ కేటగిరిలో అత్యుత్తమ చిత్రంగా అకాడెమీ అవార్డు లభించింది. 1995లో వాల్ట్‌డిస్నీ సంస్థ పిక్సర్ వారి పూర్తిస్థాయి కంప్యూటర్ యానిమేటెడ్ ఫీచర్ ఫిల్మ్ అయిన 'టాయ్ స్టోరీ'ని విడుదల చేయడంతో ఇక ఈ సంస్థ చిత్ర నిర్మాణంలో అత్యున్నత సంస్థలలో ఒకటిగా నిలిచిపోయింది.1995లో 'ఎ బగ్స్ లైఫ్', 1999లో 'టాయ్‌స్టోరీ-2' చిత్రాలను నిర్మించిన ఈ సంస్థ ఈ మూడు చిత్రాల నుంచి సుమారు 1.2 బిలియన్ డాలర్ల వ్యాపారం చేసింది. వీరి నాల్గవ చిత్రం 'మోన్‌స్టర్స్' 2001 నవంబర్‌లో విడుదలైంది.

తర్వాత యాపిల్ తాత్కాలిక సిఇవోగా నియమితులైన జాబ్స్ 1999లో తిరిగి యాపిల్ సిఇవోగా బాధ్యతలు చేపట్టాడు. ఆనాటికి నష్టాలలో మునిగివున్న యాపిల్‌ని తిరిగి లాభాల బాటలోకి తీసుకొచ్చి, గత దశాబ్దపు సంచలన ఉత్పత్తి అయిన 'ఐమ్యాక్'ని విడుదల చేయడం ద్వారా తిరిగి వెలుగులోకి వచ్చాడు. 1991లో లారెన్స్ పావెల్‌ని వివాహమాడిన జాబ్స్‌కి ముగ్గురు పిల్లలు. 1985లో 'నేషనల్ టెక్నాలజీ మెడల్', 1989లో 'ఎంటర్‌ప్రెన్యూర్ ఆఫ్ ది డికేడ్' వంటి ప్రతిష్టాత్మక అవార్డులను ఈయనను వరించాయి. 'కంప్యూటర్ యుగం తొలిరోజుల్లోనే ఈ రంగంలో అడుగుపెట్టడం నా అదృష్టం. ఆ రోజుల్లో వ్యక్తులు ఈ రంగంపై ప్రేమతో పనిచేశారు కానీ, డబ్బు కోసం కాదు' అని పేర్కొనే స్టీవ్‌జాబ్స్... నేటికీ తనదైన శైలిలోనే పనిచేస్తారు. పనిచేయడమే జీవిత ధ్యేయమన్నట్లుగా మెలిగే ఈ వ్యక్తి, తాను ఉత్సాహం నింపుకుని తనతో పనిచేసేవారికీ ఉత్సాహం నింపుతారు. ఎన్నో ఎత్తుపల్లాలను చవిచూసిన స్టీవ్‌జాబ్స్ తన 55ఏళ్ళ వయస్సుకే రిటైర్డ్ కావడం... అదీ క్యాన్సర్ వ్యాధితో రోజులు లెక్కిస్తుండడం ఈ రంగంలోని ప్రతి ఒక్కరినీ, యాపిల్ కంప్యూటర్ అభిమానులనూ మనసు కలచివేసే సంఘటనే.

- కె.ఎక్స్.రాజు



యాపిల్ కంపెనీ మొదటి కంప్యూటర్

ఒక డాలర్ జీతమే...

ప్రపంచంలోనే అతి పెద్ద టెక్నాలజీ సంస్థను నడుపుతున్న వ్యక్తి యాపిల్ కంప్యూటర్స్ చీఫ్ స్టీవ్‌జాబ్స్ జీతం ఎంతో తెలుసా? కేవలం ఒక్క డాలర్ మాత్రమే. గత మూడేళ్ల నుంచి ఆయన తన జీతం కేవలం ఒక డాలర్ మాత్రమే. అందుకు కారణం కూడా ఉంది. 2008-09లో ప్రపంచవ్యాప్తంగా ఏర్పడిన ఆర్థిక మాంద్యంతో తాను వేతనం తీసుకోరాదని, సంవత్సరానికి కేవలం 1 డాలర్ మాత్రమే తీసుకోవాలని నిర్ణయించుకున్నాడు. 2010 సంవత్సరానికి జీతంగా 1 డాలర్‌తో పాటు, వ్యాపార నిమిత్తం ప్రయివేట్ జెట్ విమానాన్ని వాడుకున్నందుకు 248,000 డాలర్లు అందుకున్నాడు. ఆయనకు కంపెనీలో 5.5 మిలియన్ డాలర్ల షేర్లున్నాయి. నాస్‌డాక్‌లో లిస్ట్ అయ్యే ఆపిల్ కంప్యూటర్ మార్కెట్ వాల్యూ జనవరి 7, 2011 నాటికి 308 బిలియన్ డాలర్లు. గత ఆర్థిక సంవత్సరం 65.2 బిలియన్‌ల రెవెన్యూలో నికర లాభం 14 బిలియన్ డాలర్లను నమోదు చేసింది.

చూద్దామా

అజంతా గుహలు
ఆకట్టుకునే చిత్రాలు

ఎల్లోరా గుహలు చూసిన ఆనందంతో, ఇక్కడేం చూడబోతున్నామనే ఆత్రుతతో అజంతా బయల్దేరాం. తెల్లవారుజామునే బయల్దేరామేమో చుట్టుపక్కలంతా మంచు తుంపర పడుతోంది. దారికిరువైపులా ఉన్న చెట్లు కలిసిపోయి ఆర్చిలా స్వాగతం చెబుతున్నాయి. రోడ్డుకి ఒకవైపు పెద్ద పెద్ద కొండలుంటే మరోవైపు అగాధంలాంటి లోయ... మధ్య మధ్యలో చిన్న చిన్న ఊళ్లు... అంటే ఓ పది, పదిహేను ఇళ్లు మాత్రమే... ఎల్లోరా నుండి అజంతా వరకు దారిమొత్తం ఇలా చేలమధ్యలోనే ఇళ్లు కనిపించాయి. పచ్చని పొలాల మధ్య ఆ పొదరిళ్లు ముచ్చటగా ఉన్నాయి.

ఎల్లోరా నుండి 100 కిలోమీటర్ల దూరంలో అజంతా గుహలున్నాయి. వీటి నిర్మాణం తర్వాత ఎన్నో ఏళ్ల నిర్లక్ష్యానికి గురై తిరిగి 18వ శతాబ్దంలో బయటపడ్డాయి. అజంతా అనే ఊరి నుండి 8 కిలోమీటర్ల దూరంలో వున్నాయి. గుహలు మరో 4 కిలోమీటర్ల దూరంలో ఉండగానే మనం తీసుకెళ్లే వాహనాలు ఆపేస్తారు. అక్కడ్నుండి వారి వాహనాల్లోనే వెళ్లాలి. అక్కడ కూడా ఎ.సి, నాన్ ఎ.సి బస్సులున్నాయి. ఎల్లోరా గుహల దగ్గర కంటే ఇక్కడ ఇంకా ఎక్కువ జన సందోహం ఉంది.

చుట్టూ చాలా పెద్ద అడవి... పర్వత శ్రేణులు, పచ్చని ప్రకృతి మధ్య గుర్రపునాడా ఆకారంలో ఈ గుహలున్నాయి. అయితే ఎల్లోరా కంటే ఇవి తక్కువ వైశాల్యంలో ఉండడం వల్ల ఎక్కువ దూరం నడిచేపని ఉండదు. అక్కడి లాగే ఇక్కడ కూడా కొండని తొలిచారు. వీటిలో కొన్ని క్రీస్తుపూర్వానికి చెందినవి కూడా ఉన్నాయి. వీటి ముందు అందమైన పెద్ద లోయ ఉంది. ఈ గుహలన్నిటిలో శిల్పకళ కన్నా చిత్రకళ అమితంగా ఆకర్షిస్తుంది. ఆ చిత్రాలవల్లే ఈ గుహలకి ఇంతటి పేరు ప్రఖ్యాతులొచ్చాయి.

మొత్తం 30 గుహల్లో కొన్ని అసంపూర్ణంగా ఉన్నాయి. ముఖ్యంగా చూడాల్సినవి 1,2,16,17,19,26,29 గుహలు. వీటిలో చాలా వరకు చిన్న చిన్న లైట్లు ఏర్పాటు చేశారు. రెండు మూడు గుహల్లో పెద్ద లైట్లు కూడా ఉన్నాయి. అన్ని గుహల్లో ఫొటోలు తీసుకోవచ్చు కానీ ఫ్లాష్ వెయ్యనివ్వరు.

1వ గుహ ఐదవ శతాబ్దం నాటిది. దీని ముఖద్వారం చక్కటి నగిషీలతో దర్శనమిస్తుంది. వరండా లాంటి ముందు భాగం దాటి లోపలికెళ్తే విశాలమైన గది ఉంది. అందులో మళ్లీ చిన్న చిన్న గదులున్నాయి. కానీ లోపలంతా చీకటి. వారు ఏర్పాటు చేసిన లైట్లే లేకపోతే ఏమీ కనిపించదు. ముఖద్వారానికి ఎదురుగా ఉన్న గదిలో పెద్ద బుద్ధుడు, ఆయన మొదటి ఐదుగురి శిష్యుల విగ్రహాలున్నాయి. ఇక చుట్టూ ఉన్న గోడలు, పై కప్పంతా అనేక కథలు చిత్రించిన ఆనవాళ్లు కనిపించాయి. కానీ వీటిలో సగానికిపైగా ఇప్పుడు కనిపించడం లేదు. రంగు వెలిసిపోయి, ఊడిపోయినట్లున్నాయి. ఉన్నవాటి వరకు మాత్రం చాలా బాగున్నాయి.

కనిపించే కొద్ది చిత్రాల్లో చాలా వరకు జాతక కథలే. వాటిలో ముఖ్యమైనవి మనందరికీ తెలిసిన శిబి చక్రవర్తి కథ, గౌతముడు ఏడేళ్ల అన్వేషణ తర్వాత జ్ఞానోదయం పొందుతున్న చిత్రం ముఖద్వారానికి ఎడమవైపు గోడకి ఉన్నాయి. కుడివైపు గోడమీద చిత్రించిన కథ విషయానికొస్తే... దుష్టుడైన మార గౌతముడికి అడుగడుగునా ఆటంకాలేర్పరుస్తాడు. చివరికి గౌతముని తపస్సును భగ్నం చేయమని తన కూతుళ్లనే పంపించే ఇతివృత్తం చిత్రించారు. మిగతా గోడలకి బుద్ధుని జీవితంలో ముఖ్యమైన సంఘటనలకు చెందిన అనేక చిత్రాలు కనిపిస్తాయి. ఇంకా వీటి మధ్యలో కోతులు, నెమళ్ల చిత్రాలూ ఉన్నాయి.

2వ గుహలో గౌతముని పుట్టుకకు సంబంధించిన అనేక సంఘటనలు చిత్రించారు. గౌతముని తల్లి మాయకు ఒక కల రావడం, దాన్ని ఆమె భర్తతో చెప్పడం, అతను బ్రాహ్మణులను ఆస్థానానికి పిలిపించి మాయకు వచ్చిన కలకు అర్థమేంటని అడగడం, వారు ఆమెకు గౌతమోత్తముడు జన్మిస్తాడని చెప్పడం... అక్కడ చిత్రించారు. ఈ గుహలో పైకప్పుకి ఒక చోట బారులు తీరిన హంసలు కనిపించాయి.



2 వ గుహలో పై కప్పుమీది చిత్రాలు

ముందున్న గోడకు మరో చక్కని చిత్రం... రాజు ఒక స్త్రీని ఖడ్గంతో శిక్షిస్తున్నట్లు, ఆమె భయపడి రాజుని వేడుకుంటున్నట్లు వుంది.

అజంతాలో అన్నింటికంటే పెద్ద గుహ నాల్గవది. ముఖద్వారం దాటి లోపలికెళ్తే 28 స్థంభాలున్న పెద్దగది ఉంది. కుడివైపు గోడకి బుద్ధుణ్ణి ప్రార్థిస్తున్న భక్తులు, ఒక జంటని తరుముకొస్తున్న ఏనుగు, ఉడుతతో ఆడుకుంటున్న స్త్రీ చిత్రాలు కనిపిస్తాయి. 6వ గుహలో అనేక భంగిమల్లో బుద్ధుని విగ్రహాలున్నాయి.

9వ గుహ క్రీస్తుపూర్వం ఒకటవ శతాబ్దం నాటిది. ఇందులో రోజువారీ జీవితంలో జరిగే సంఘటనలను చిత్రించారు. 10 వ గుహ క్రీస్తు పూర్వం 2వ శతాబ్దం మొదటి భాగానికి చెందినది. ఇది చూడ్డానికి తొమ్మిదవ గుహలాగే ఉంటుంది. కానీ దానికంటే పెద్దది. ఇక్కడున్న అన్ని గుహలకంటే ఇదే ప్రాచీనమైంది. ఇందులో రాజు తన సైన్యంతో పాటు, నృత్యకళాకారులు, ఆస్థాన గాయకులతో కొలువుతీరి ఉన్నాడు. ఇందులో వారు ధరించిన దుస్తులు, నగలు, కేశాలంకరణ ఇప్పటికీ స్పష్టంగా కనిపిస్తుంది. వేయి సంవత్సరాల తర్వాత కూడా ఇంతందంగా కనిపిస్తున్నాయంటే ఎన్ని జాగ్రత్తలు తీసుకుని ఈ చిత్రాలు గీచారో! గోడకు రెండు వైపులున్న చిత్రాలు పాడైపోకుండా కొంత వరకు అద్దాలు బిగించారు. ఈ గుహలోని గోడలమీద, స్థంభాలమీదున్న పెయింట్లు చాలా వరకు ఇప్పటికీ స్పష్టంగా కనిపిస్తున్నాయి. అయితే లైట్లు వేస్తేనే అవి కనిపిస్తాయి.

13వ గుహని పురావస్తు శాఖవారు స్టోర్ రూమ్‌గా వాడుతున్నారు. 16వ గుహని సన్యాసుల కోసం నిర్మించారట. ఇందులో గౌతముడికి బాల్యంలో ఎదురైన అనేక సంఘటనలను చిత్రించారు. ముఖ్యంగా 'మరణిస్తున్న రాకుమారి' చిత్రం అందరినీ ఆకట్టుకుంది. రాకుమారి మృత్యుముఖంతో ఉంటే, ఆమె చెలికత్తెలు దుఃఖిస్తున్నట్లున్న చిత్రం చూపరులను కట్టిపడేస్తుంది. ఈ చిత్రం బుద్ధుని పినతండ్రి కొడుకు భార్యదట. నందుడు సన్యాస జీవితం కోరుకున్న సందర్భంలోనిది ఈ చిత్రం. ఆమె పడుతున్న హృదయ వేదనను అలా చిత్రించారు. 16వ గుహ దగ్గరి నుండి లోయలోకి (ఈ లోయ ఒకప్పటి నది) మెట్లున్నాయి.

17వ గుహ ముందు భాగంలో అందమైన నగిషీలు చెక్కారు. ఇందులో మానవ చిత్రాలు, గంధర్వులు, అప్సరసల చిత్రాలున్నాయి. కుడివైపు గోడమీద బుద్ధుడు మదపుటేనుగును అదుపులోకి తెస్తున్న చిత్రం అద్భుతంగా ఉంటుంది. జాతక చిత్రాల్లో ఆత్మ బలిదానం ఎక్కువసార్లు కనిపించింది. అందులో ఒకదాని వృత్తాంతం... ఒక జన్మలో బోధిసత్వుడు తనకున్నవన్నీ దానం చేయాలనే తపనతో ఉంటాడు. తన దగ్గరున్న అద్భుత శక్తిగల ఏనుగును దానం చేస్తాడు. తన దగ్గరున్న రథాన్ని, గుర్రాల్నీ దానం చేస్తాడు. చివరికి పిల్లల్ని కూడా దానం చేసే దృశ్యాలు మనసుకు హత్తుకుంటాయి. ఆ చిత్రాల్లోని ముఖ కవళికలు కూడా చాలా స్పష్టంగా కన్పిస్తాయి. బుద్ధుని ముందు ఓ తల్లీ కొడుకులు నమస్కరిస్తున్న చిత్రం, రాజమహలు ముందు బుద్ధుడు భిక్షాటన చేసే చిత్రం మరో గోడమీద వున్నాయి.

19వ గుహ ముందుభాగంలో చాలా బుద్ధ విగ్రహాలు అనేక వరుసలుగా ఎదురెదురుగా ఉన్న రెండు గోడల మీద చెక్కారు. ఇందులో బుద్ధుడి విగ్రహాలు అనేక ముద్రల రూపంలో ఉన్నాయి. లోపలున్న పెద్ద బుద్ధ విగ్రహం పైన ఒకదానిమీద ఒకటి మూడు గొడుగులున్నాయి. ఇవి బుద్ధం శరణం గచ్ఛామి, ధర్మం శరణం గచ్ఛామి, సంఘం శరణం గచ్ఛామి..... తెలుపుతాయట.

ఈ గుహల తవ్వకాలన్నింటిలో 24వ గుహ పెద్దది. కానీ ఇది పూర్తికాలేదు. 26వ గుహలో శయనిస్తున్న బుద్ధుడు కనిపిస్తాడు. ఈ విగ్రహం చాలా పెద్దది. ఇక్కడి గోడపై కూడా బుద్ధుని తపోభంగం చిత్రించారు.

అజంతా గుహలకు సోమవారం సెలవు. ఈ గుహలకు వెళ్లే బస్టాపులో పెద్ద షాపింగ్ కాంప్లెక్స్ కూడా ఉంది. ఇక్కడ అడుగడుగునా కమర్షియలైజేషన్ కనిపించింది. ఈ గుహల్లో ముఖ్యమైన వాటన్నింటి దగ్గరా క్యూ పద్ధతి ఉంది.

- బి. మల్లేశ్వరి



26వ గుహలో శయనిస్తున్న బుద్ధ విగ్రహం



19వ గుహలో ...

అట్టమీది కథ



'రేటు' కోసమే రేటింగ్స్

స్టాండర్డ్ అండ్ పూర్ కంపెనీ పరపతిని తగ్గించటానికి కారణం ఏదైనప్పటికీ పైకి మాత్రం నీవు నేర్పిన విద్యయే నీరజాక్షా అన్నట్లుగా ఉంది. చెప్పుకోలేని చోట తగిలిన ఈ దెబ్బతో అమెరికా మింగా కక్కా లేకుండా తయారైంది. తమ పరపతి తిరపతి కావటానికి త్వఋంర త్వఋంర అన్నట్లుగా డెమోక్రాట్, రిపబ్లికన్ పార్టీలు తమ రాజకీయ చతురతను ప్రదర్శించి లబ్ది పొందేందుకు ప్రయత్నించాయి. అప్పు తీసుకున్నవాడి కంటే వారికి ఇచ్చిన వారికి నిదురబట్టదన్నట్లు అమెరికాకు అప్పులిచ్చిన వారందరూ డాలర్ డొల్లయితే తమ ఇల్లు గుల్లవుతుందని భయపడ్డారు. ఒక కంపెనీ పరపతిని తగ్గించినంత మాత్రాన అమెరికాకు ఏం జరుగుతుంది. అసలు కంపెనీల రేటింగ్‌లు వాస్తవాలేనా. వాటివెనుక ఉన్న అసలు కథలేమిటి?. ఇంకెందుకు ఆలస్యం ! కంచికి తరువాత వెకుదురు. ముందు ఈ వారం అట్టమీది కథలోకి వెళతారు కదూ !!

'ప్రపంచంలో రెండు సూపర్ పవర్లు ఉన్నాయి. ఒకటి, అమెరికా అని వేరే చెప్పనవసరం లేదు, రెండవది బాండ్ రేటింగ్ ఏజన్సీస్' అని థామస్ ఫ్రైడ్‌మాన్ 1996లో పేర్కొన్నారు. ఆయన ప్రపంచ జర్నలిజంలో అసమాన ప్రతిభ చూపినందుకు అందచేసే పులిట్జర్ బహుమతి గ్రహీత. 'బాంబులు వేసి అమెరికా నిన్ను నాశనం చేయగలిగితే మూడీస్ పరపతిని తగ్గించి బాండ్లను నాశనం చేస్తుంది. అంతే కాదు నన్ను నమ్మండి కొన్ని సార్లు ఎవరు అత్యంత శక్తివంతులో తెలియదు' అని ఫ్రైడ్‌మాన్ అన్నారు. ఇప్పుడు స్టాండర్డ్ అండ్ పూర్(ఎస్ అండ్ పి) కంపెనీ విషయంలో అదే జరిగింది. గత నెల ఎనిమిదవ తేదీన అమెరికా పరపతిని తగ్గించటంతో ఒబామా సర్కార్ దిమ్మ తిరిగి పోయింది. ప్రపంచ దేశాలన్నీ ఒక్క కుదుపుతో ఉలిక్కి పడ్డాయి. అమెరికా ఆర్థిక ఆధిపత్యం కుప్పకూలటానికి నాంది పలికిందా అన్నట్లు పరిస్థితి తయారైంది.

అలాంటి కంపెనీకి అధ్యక్షుడిగా ఉన్న భారత సంతతికి చెందిన దేవేన్ శర్మను యాజమాన్యం ఒక్క కలంపోటుతో బాధ్యతల నుంచి తొలగించింది. ఏ లక్ష్యంతో పరపతి తగ్గించినప్పటికీ అనూహ్య పరిణామంగా మారటంతో ఒబామా సర్కార్‌ను మంచి చేసుకొనేందుకు ఈ పని చేశారన్నది వేరే చెప్పనవసరం లేదు. ఆయన చేసిందల్లా సిబ్బంది లెక్కలు సరిగా చూడలేదని నెపాన్ని వేరేవారి మీదకు నెట్టకుండా బహిరంగంగా పరపతి తగ్గింపును సమర్ధించటమే. అయితే దీనికి, శర్మను తప్పించటానికి సంబంధం లేదని చెప్పటం వేరే విషయం అనుకోండి. త్వరలో కంపెనీని రెండుగా విభజించనుండటం, దానిలో ప్రాధాన్యత లేని దాని బాధ్యతను తనకు అప్పగించనున్నారని గ్రహించిన శర్మ ముందుగానే బయటపడాలని నిర్ణయించుకొన్నట్లు చెబుతున్నారు. అందుకే రేటింగ్‌ను తగ్గించటాన్ని గట్టిగా సమర్ధించారా? తనను కాదనుకొంటున్న కంపెనీ ఏమైతే తనకేం అనుకున్నారా? ఏమో? డబ్బు విలువలు అలాంటివే మరి.

యాంటీ సెక్యూరిటీ అనే సైబర్ 'హాక్టివిస్ట్' గ్రూప్ కంప్యూటర్ల భద్రతా పరిశ్రమకు వ్యతిరేకంగా పని చేస్తోంది. ఇటీవల అమెరికాకు చెందిన వాన్‌గార్డ్ డిఫెన్స్

ఇండస్ట్రీస్ (విడిఐ) కంపెనీ కంప్యూటర్లలోకి చొరబడి వేలాది ఇ-మెయిళ్ల సమాచారాన్ని సేకరించింది. ఈ కంపెనీ యుద్ధాల్లో వినియోగించే మానవ రహిత విమానం లేదా డ్రోన్స్‌ను తయారు చేస్తోంది. ఆ ఈమెయిళ్లలో బయటకు రాని కీలక రహస్య సమాచారం చాలా ఉంది. సూదికోసం సోదికి పోతే పాత వ్యవహారాలన్నీ బయటకు వచ్చినట్లుగా విడిఐ ఉపాధ్యక్షుడు రిచర్డ్ టి గార్సియా ఎస్‌అండ్‌పికి ఏప్రిల్25న పంపిన ఇమెయిల్ కూడా బయట పడింది. దానిలో మెరిల్‌లించ్ కంపెనీ సలహాదారు ఒకరు 'ఎస్‌అండ్‌పి అమెరికా బాండ్ రేటింగ్‌ను తగ్గించే అవకాశం ఉందని' తనకు సలహా ఇచ్చినట్లు గార్సియా పేర్కొన్నాడు. అంటే ఈ విషయం బయటి వ్యక్తులకు ముందే తెలిసిందన్నమాట. క్రెడిట్ రేటింగ్ ఏజన్సీస్ సంస్కరణల చట్టం 2006 ప్రకారం ఏదైనా ఏజన్సీకి చెందిన సమాచారం బహిరంగంగా వెల్లడించటానికి ముందే లీకైనట్లు రుజువైతే అలాంటి కంపెనీల లైసెన్సు రద్దు అవుతుంది. ఆ లెక్కన ఎస్‌అండ్‌పి లైసెన్సు రద్దు కావాలి. ఆ ఇమెయిల్‌లో మెరిల్ లించ్ సలహాదారు ఇంకా ఇలా చెప్పినట్లు ఉంది. 'ప్రస్తుత పరిస్థితిని చక్కదిద్దటానికి వారు అమెరికా ప్రభుత్వానికి రెండు సంవత్సరాల గడువు ఇచ్చారు.అయితే రిపబ్లికన్లు, డెమొక్రాట్లు రెండు పార్టీలు 2012లో జరగాల్సిన ఎన్నికల కారణంగా ఎస్‌అండ్‌పి చెప్పిన గడువు రెండు సంవత్సరాలలో పరిస్థితిని చక్కదిద్దటానికి చేయాల్సినదానిని చేయవు'. అంటే ఇప్పుడు అమెరికా సర్కారు చెబుతున్నట్లు లెక్కలు తప్పు అనే అవకాశమే లేదు. ఎస్‌అండ్‌పి కంపెనీ అంచనా ఎంతో పక్కాగా రూపొందించిందన్నది స్పష్టం.

స్టాండర్డ్ అండ్ పూర్ కంపెనీ ప్రకటనపై మండి పడిన ఒబామా సర్కార్ అది గతంలో చేసిన సిఫార్సులపై దర్యాప్తు జరపాలని న్యాయశాఖను ఆదేశించింది. ఇటలీ రేటింగ్‌ను మరింత తగ్గిస్తామని ప్రకటించటంతో రేటింగ్ ఏజన్సీల కార్యాలయాలపై పోలీసులు దాడులు చేశారు. ఎందుకయ్యా అంటే నిబంధనలను సరిగా పాటిస్తున్నాయా లేదా అని చూసేందుకని చెప్పారు. పోర్చుగల్ రేటింగ్‌ను తగ్గించినపుడు ఐరోపా దేశాలు ఇది 'ఆంగ్లో-శాక్సన్'(ఆంగ్లం మాట్లాడేదేశాలు) దేశాల సంస్థల విధ్వంసకాండ అని వర్ణించాయి. వాటి గుత్తాధిపత్యానికి గండికొట్టాలని జర్మనీ పేర్కొన్నది. అయితే ఈ సంస్థలు అమెరికాను కూడా వదలలేదు. అనేక చోట్ల లేని పరపతిని తగ్గించి దెబ్బతీస్తే అమెరికాలో లేని పరపతిని ప్రకటించి ఆర్థిక సంక్షోభాన్ని రుద్దాయంటే అతిశయోక్తి కాదు. అమెరికా సంక్షోభం తనఖా కుంభకోణంతో ప్రారంభమైన విషయం తెలిసినదే. దానిలో భాగస్వాములైన సంస్థల పరపతి 'భేషుగ్గా' ఉందని సిఫార్సు చేసిన రేటింగ్ సంస్థలలో ఈ కంపెనీ కూడా ఒకటి. తాజా దర్యాప్తు అమెరికా పరపతి రేటు తగ్గింపునకు ముందే ఆదేశించినట్లు ప్రభుత్వం చెప్పటం విశేషం.తాము అందచేసిన గణాంకాల కూడికలు తీసివేతల మదింపులో ఎస్‌అండ్‌పి కంపెనీ సిబ్బంది తప్పిదాన్ని తాము కనుగొన్నట్లు అమెరికా ప్రభుత్వ అధికారులు చెబుతున్నారు. తనఖా బాండ్ల రేటింగ్‌ను తగ్గించి చెప్పాలన్న తమ కోర్కెను ఎస్‌అండ్‌పి గతంలో ఖాతరు చేయలేదని ఇప్పుడు అధికారులు చెవులు కొరుకుతున్నారు. అయితే మూడీస్, ఫిచ్ అనే రెండు సంస్థల రేటింగ్స్‌ను కూడా ఈ విచారణలో భాగం చేసేదీ లేనిదీ వెల్లడి కాలేదు. తనఖా బాండ్లను కొనుగోలు చేయటంలో ఎలాంటి రిస్కు లేదని సిఫార్సు చేసేందుకు వాటిని జారీ చేసిన ఆర్థిక సంస్థలు, బ్యాంకుల నుంచి భారీ మొత్తంలో సొమ్ము వసూలు చేసి మిగతా రేటింగ్ సంస్థల కంటే రికార్డు స్థాయిలో లాభాలు సంపాదించిందన్నది అమెరికా సర్కారు ఆరోపణ.

రేటింగ్ సంస్థల 'రేటింగ్‌లపై' విచారణ జరపనున్నారనే వార్తలు జూన్‌లోనే వెలువడిన మాట వాస్తవం. అయితే ఇవి కూడా అమెరికా పరపతి రేటింగ్‌ను తగ్గించాల్సి వస్తుందని ఎస్ అండ్ పి హెచ్చరించిన తరువాతే అని గమనించాలి. నిజానికి అమెరికా సర్కారుకు చిత్తశుద్ధి ఉంటే తనఖా కుంభకోణంతో ఆర్థిక వ్యవస్థ కుదేలైన మూడు సంవత్సరాల నాడే అలాంటి విచారణకు ఆదేశించి ఉండాల్సింది. ఇంతకాలం ఒబామా సర్కార్ ఏ గుడ్డిగుర్రానికి పళ్లు తోముతున్నట్లు?

నిష్పక్షపాతంగా ఉన్నవిషయాలను ఉన్నట్లు చెప్పి తటస్థంగా వ్యవహరించాల్సిన సంస్థలు మంచి రేటింగ్‌లు ఇచ్చేందుకు బాండ్లు విక్రయించే సంస్థల నుంచి పెద్ద మొత్తంలో సొమ్ము గుంజటం బహిరంగ రహస్యమే. అందువలన ఆయా కంపెనీలపై కూడా దర్యాప్తు జరిపితేనే వాటి మధ్య ఉన్న అక్రమ బంధం బయటకు వస్తుంది. రేటింగ్ ఏజన్సీలు అక్రమ పద్ధతుల్లో అగ్రశ్రేణి రేటింగ్‌లు ఇవ్వటమే కాదు, ఆర్థిక వ్యవస్థలు కుప్పకూలిపోయే విధానాల రూపకల్పనలో కూడా అవి సాధనాలుగా ఉపయోగపడుతున్నాయి. అలాంటి మూడు పెద్ద సంస్థల్లో ఎస్‌అండ్‌పి మరింత దూకుడుగా ఉంటుందని రూజ్వెల్ట్ ఇనిస్టిట్యూట్ పరిశోధకుడు మాట్ స్టోలర్ అంటారు. కెనడాలో ఆరోగ్య, నిరుద్యోగబీమా పథకాలను గనుక రద్దు చేయనట్లయితే ప్రభుత్వ బాండ్ల రేటింగ్‌ను తగ్గిస్తామని 1990 దశకంలో ఎస్‌అండ్‌పి, మూడీస్ బెదిరించాయని స్టోలర్ పేర్కొన్నారు. ఇప్పుడు అమెరికా వ్యవహారంలో కూడా ఎస్‌అండ్‌పి లక్ష్యం సామాన్య ప్రజల పథకాల ఖర్చు తగ్గించటమే అన్నారు. గత మూడు సంవత్సరాలలో ధనిక దేశాలు, వాటి విధానాలకు బలైన ఇతర దేశాల ఆర్థిక సంక్షోభ తీరు తెన్నులను చూస్తే రేటింగ్ కంపెనీలు 'రాజకీయపాత్ర'ను కూడా పోషించినట్లు చూడవచ్చు. వాటి రేటింగ్‌లను బట్టే తెల్లవారేసరికి గ్రీసు, ఐర్లండ్, పోర్చుగల్ వంటిదేశాలు తమ ఆస్తులను కారుచౌకగా తెగనమ్ముకోవాల్సి వచ్చిందంటే అతిశయోక్తి కాదు. అనేక దేశాలలో అమెరికా రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా ఆయాదేశాల రేటింగ్‌లను నిర్ణయించి వత్తిడి పెంచిన ఉదంతాలు కూడా ఉన్నాయి.



మన దేశంలో ఏం జరగబోతోంది?

రేటింగ్ కంపెనీలు కేంద్ర, రాష్ట్ర, స్థానిక సంస్థలతో పాటు కార్పొరేట్ కంపెనీలకు కూడా రేటింగ్‌లు ఇస్తాయి. మన దేశంలో కూడా మున్సిపాలిటీలను పెద్ద పెద్ద కార్పొరేషన్లుగా మార్చి వాటికి అవసరమైన నిధుల కోసం బాండ్ల జారీ వంటి విధానాలను అనుసరించాలని ప్రపంచబ్యాంకు ఆదేశించింది. దానిలో భాగమే జవహర్‌లాల్ నెహ్రూ పట్టణ పునరుద్ధరణ పథకం. ముందుగా చెత్తతో మొదలు పెట్టి ప్రతిసేవకూ పన్నులు పెంచటం ప్రారంభించారు. అందుకోసమే ఇటీవలి కాలంలో కొత్త కార్పొరేషన్లు, మున్సిపాలిటీలను ఏర్పాటు చేయటంలో ప్రభుత్వాలు చురుకుగా కదులుతున్నాయి. రేటింగ్ సంస్థలు అమెరికానే కాదు గ్రీస్ వంటి దేశాల విషయంలోనూ ఇదే విధంగా వ్యవహరించి రేటింగ్ తగ్గించి రుణాలను తీర్చేందుకు ప్రయివేటీకరణ ద్వారా ప్రభుత్వ ఆస్తులను తెగనమ్మటంలో తమ వంతు పాత్రను పోషిస్తున్నాయి.

భారత్‌లో రేటింగ్ ఏజన్సీలు

క్రిసిల్, ఇక్రా, కేర్, డిసిఆర్ ఇండియా, అనిక్రా. ఇవన్నీ ఆ కంపెనీల పొట్టి పేర్లు. ఉదాహరణకు క్రిసిల్ పూర్తి పేరు క్రెడిట్ రేటింగ్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ ఆఫ్ ఇండియా లిమిటెడ్.

రేటింగ్‌లకు అర్థం

ఏఏఏ: తిరుగులేని రక్షణ

ఎఎ-: పక్కా రక్షణ

ఎ-: తగినంత రక్షణ

బిబిబి: రక్షణ ఫర్వాలేదు

బిబి-: ఫర్యాలేదు

బి-: తగిన రక్షణ లేదు

సి-: రిస్కు చాలా ఎక్కువ

డి-: దివాళా స్థితి

అయితే ఒక్కొక్క దేశంలో, సంస్థ సంస్థకూ రేటింగ్ పదజాలంలో తేడాలుంటాయి. ఉదాహరణకు అమెరికా రేటింగ్‌ను స్టాండర్డ్ అండ్ పూర్ (ఎస్‌అండ్‌పి) కంపెనీ ఏఏఏ నుంచి ఏఏ+ స్థాయికి తగ్గించింది. ఇలా మైనస్‌లు, ప్లస్‌లు, అంకెలు తోడవటం అంటే గ్రేడ్‌ల సంఖ్య పెరుగుదలకు సూచిక. ఇదే విధంగా ఒక సమయంలో ఒక దేశానికి రేటింగ్ అన్ని సంస్థలూ ఒకే రేటింగ్‌ను ఇవ్వవు. ఎందుకంటే ఎవరి అంచనా వారిదే.

రేటింగ్ ఏజన్సీల అక్రమాలు ప్రారంభ స్థాయి విశ్లేషకుడు మొదలు కంపెనీ చైర్మన్, సిఇవో వరకు ఉంటాయని మూడీస్ కంపెనీలో ఒక విభాగానికి సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా పదకొండు సంవత్సరాలు పనిచేసి గతేడాది రాజీనామా చేసి విలియం హారింగ్టన్ అమెరికా సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ కమిషన్‌కు సమర్పించిన ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ ఖాతాదార్లకు కావాల్సిన రేటింగ్‌లు ఇవ్వాలని విశ్లేషకులపై వత్తిడి, వేధింపులకు గురి చేయటం సర్వసాధారణమని, మాట వినని వారిని బదిలీ లేదా ఉద్యోగం నుంచి తొలగిస్తారని తెలిపారు.

నోబెల్ బహుమతి గ్రహీత జోసెఫ్ స్టిగ్లిజ్, ఆర్థిక సంక్షోభంలో రేటింగ్ ఏజెన్సీలు కీలకమైన అపరాధులు, ఎఫ్ రేటున్న బాండ్లను ఏ రేటు బాండ్లగా మార్చటంలో తమ వంతు పాత్ర పోషిస్తాయి.రేటింగ్ ఏజన్సీల తోడ్పాటు లేకుండా బ్యాంకులేమీ చేయజాలవు' అన్నారు. తమ కంపెనీలో జరుగుతున్న కథలన్నీ ఎస్‌అండ్‌పి సిబ్బందికి తెలుసన్నది 2006లో ఒక విచారణ సందర్భంగా సాక్ష్యంగా సమర్పించిన అంతర్గత ఇమెయిల్స్ వెల్లడించాయి. రేటింగ్‌ను నిర్ణయించే అధికారులకు ఉన్న ప్రమాదాల గురించి 'పేర్కొంటూ' ఈ తప్పుడు పేక మేడ కూలిపోయే సమయానికి మనమందరం తగినంత సంపాదించుకొని ఉద్యోగవిరమణ చేయాలని ఆశిద్దాం' అని ఉంది.

రేటింగ్ ఏజన్సీలు ఎంత అడ్డగోలుగా వ్యవహరిస్తాయనడానికి మరో ఉదాహరణ. మనందరకు ఎన్రాన్ కంపెనీ గురించి తెలిసినదే. మహారాష్ట్రలోని దబోల్ అనే చోట విద్యుత్ కేంద్రాన్ని నిర్మించి ఉత్పత్తి చేయకుండానే లాభాలు మూటగట్టుకొని దానిని మనకు వదలి పెట్టి వెళ్లింది.దాని మాతృసంస్థ అమెరికాలో ఉంది. దాన్ని దివాలా తీయిస్తున్నారని తెలిసినప్పటికీ మూడీస్ ఏజన్సీ పదేళ్ల క్రితం కంపెనీ పరిస్థితి భేషుగ్గా ఉందని రేటింగ్ ఇచ్చిన 24 గంటల్లోనే అది కుప్పకూలిపోయింది. తాజా ఉదంతానికి వస్తే ఫ్రెడ్డీమాక్ అనే కంపెనీ వాటాల కొనుగోలుపై మూడీస్ కంపెనీ ట్రిపుల్ ఏ రేటింగ్ ఇచ్చింది. అయితే ప్రపంచ డబ్బు జలగ వారెన్ బఫెట్ ఒక టీవీలో ఫ్రెడ్డీ కంపెనీ గురించి మాట్లాడిన 24 గంటలలోనే మూడీస్ రేటింగ్‌ను తగ్గించేసింది. ఈ ఏజన్సీలు బ్లాక్ మెయిల్ చేయటంలో కూడా దిట్టలే. హానోవర్ రే అనే కంపెనీ ముడుపులు ముట్టచెప్పనందుకు మూడీస్ సంస్థ 2004లో రేటింగ్‌ను తగ్గించింది. దాంతో కంపెనీ విలువ 17.5కోట్ల డాలర్లు పడిపోయింది.

గతంలోకి వెళితే 1936లో అమెరికాలో న్యూడీల్ సంస్కరణలలో భాగంగా రేటింగ్ కంపెనీల సిఫార్సులను 'స్పెక్యులేటివ్'గా పరిగణించి చట్టబద్ధత లేని వాటి ఆధారంగా బాండ్లను కొన వద్దని బ్యాంకులు, ఆర్థిక సంస్థలను నిషేధించారు.

రేటింగ్ ఏజన్సీలు ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు తమ వనరులు పెంచుకోవటమా, అప్పుచేసి పప్పుకూడు తినటం ఏది మంచిదో సలహాలు ఇవ్వవు. స్థానిక సంస్థలకు అప్పులు పెరిగి బ్యాంకులు గట్టిగా చెల్లించాలని కోరినపుడు అందుకోసం సంస్థలు తమ ఆస్తులను అమ్ముకొని తీర్చేందుకు సిద్ధపడతాయి. వాటిని కొనుగోలు చేయటం లాభమా కాదా అని రేటింగ్ సంస్థలు సలహాలను ప్రకటిస్తాయి. ఎవరైనా తాము కోరిన మొత్తాన్ని చెల్లించకపోయినా, ఇతరత్రా లావాదేవీల్లో పేచీ వచ్చినా ఆస్తులను కొనుగోలు చేస్తే రిస్కు అని చివరి గ్రేడ్ ఇచ్చాయనుకోండి వాటి మీద రూపాయి పెట్టి అమ్మితే పది పైసలకు కూడా ఎవరూ కొనుగోలు చేయరు.

అమెరికాలోని క్లీవ్‌లాండ్ 'మున్సిపల్ లైట్' కంపెనీ ఉదంతాన్ని చూస్తే రేటింగ్ కంపెనీల అసలు రంగును అర్థం చేసుకోవచ్చు. 1907లో ఏర్పాటు చేసిన ప్రభుత్వరంగ మున్సిపల్ లైట్ కంపెనీ వీధి దీపాలతో పాటు ప్రయివేటు వినియోగదారులకు కూడా విద్యుత్ సరఫరా చేస్తుంది. దానికి పోటీగా కొన్ని బ్యాంకులు,ఇతరులు కలిసి 'మునీ లైట్' అనే మరొక కంపెనీని రంగంలోకి తెచ్చారు. దానికి 'మున్సిపల్ లైట్ 'కంపెనీ విక్రయించాలని ఓహియో నగర పాలక సంస్థపై వత్తిడి తెచ్చారు. 1977లో మేయర్‌గా ఉన్న కుసినిచ్‌ను బెదిరించారు. రుణాలు ఇవ్వకుండా బ్యాంకులను కట్టడి చేశారు.అవసరమైతే పన్నులు పెంచి నిధులు సమకూర్చుకుంటానని మేయర్ స్పష్టం చేశారు. అయితే అమెరికాలో కూడా ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణ ప్రారంభమైంది. ప్రభుత్వ విద్యుత్ కంపెనీని విక్రయిస్తే భవిష్యత్‌లో గవర్నర్‌గా పోటీచేసేందుకు తామంతా మద్దతు ఇస్తామని రేటింగ్ ఏజన్సీలతో సహా బ్యాంకులు, ఇతర పెట్టుబడిదార్లు ఆశచూపారు.అయినా లొంగకపోవటంతో వెంటనే తమ బకాయిలు చెల్లించాలని బ్యాంకులు వత్తిడి తెచ్చాయి. క్లీవ్‌లాండ్ రేటింగ్‌ను తగ్గిస్తామని రేటింగ్ సంస్థలు బెదిరించాయి. జనం కూడా మేయర్‌కు మద్దతుగా నిలిచి కావాలంటే అధిక పన్నులు చెల్లిస్తామని రిఫరెండటంలో తీర్పు చెప్పారు.

ఎస్ అండ్ పి ఇలా ఏర్పడింది

స్టాండర్డ్ అండ్ పూర్ కంపెనీ అమెరికా కేంద్రంగా 150 సంవత్సరాల క్రితం ఏర్పడింది. 1860 ప్రాంతాలలో అమెరికాలో రైలు మార్గాల నిర్మాణంలో పాలు పంచుకున్న వివిధ కంపెనీలలో దేనిలో పెట్టుబడులు పెడితే మదుపుదార్లకు లాభాలు వస్తాయనే సలహాలు ఇచ్చేందుకు ఇది ప్రారంభమైంది. ఇప్పుడు 23 దేశాలలో దాదాపు పదివేల మంది సిబ్బందితో కార్యకలాపాలు నిర్వహిస్తోంది. గతేడాది కాలంలో ఈ కంపెనీ ప్రకటించిన కొత్త రేటింగ్‌లు 1,62,418 కాగా రెండోసారి మదింపు వేసినవి 5,56,872 ఉన్నాయి. ఈ కంపెనీ రేటింగ్ ఇచ్చిన రుణ విలువ 32లక్షల కోట్ల డాలర్లు. మన దేశంలో బాంబేస్టాక్ ఎక్స్చేంజ్ మాదిరి ఇది కూడా స్టాక్ మార్కెట్ లావాదేవీలను నిర్వహిస్తోంది. వాటి విలువ దాదాపు ఆరులక్షల కోట్ల డాలర్లు. ఈ ఒక్క కంపెనీ లావాదేవీల మొత్తమే ఇంత ఉంటే అన్ని కంపెనీల మొత్తాన్ని ఊహించుకోవాల్సిందే.

అయితే బ్యాంకర్లదే పైచేయి అయింది. అప్పులివ్వకుండా తొలిసారిగా ఓహియో నగరాన్ని దివాళా తీయించారు. రేటింగ్‌లను తగ్గించటంతో నగర ఆస్తులను తెగనమ్మి అప్పులు తీర్చాల్సి వచ్చింది. 1979లో తమ మాట వినని కుసినిచ్‌కు వ్యతిరేకంగా మరొకరిని బ్యాంకర్లు రంగంలోకి తెచ్చారు. చివరికి 'మునీలైట్' కంపెనీ తన పంతాన్ని నెగ్గించుకొని 'మున్సిపల్‌లైట్' ప్రభుత్వరంగ కంపెనీని మింగివేసింది. 2003 మునీలైట్ అక్రమాల కారణంగా విద్యుత్ సరఫరా కుప్పకూలిపోయి మొత్తం 5కోట్ల మంది పౌరులు నానా ఇబ్బందులు పడ్డారు.

ఇలాంటి కంపెనీలు ప్రకటించే రేటింగ్‌లు కేవలం సలహాలు మాత్రమే.ఎవరైనా వాటి ఆధారంగా వాణిజ్య లావాదేవీలు జరిపి నష్టపోయామని ఎవరైనా కోర్టుకు ఎక్కితే చెల్లదు. అయితే ఇవి ఇచ్చే రేటింగ్‌లతో చిన్నచిన్న దేశాలు, సంస్థలు ఒక్కొక్కసారి ప్రభావితం కావచ్చుగాని అమెరికా వంటి వాటికి ఎలాంటి ఢోకా ఉండదనేందుకు ఎస్అండ్‌పి ప్రకటన తరువాత ఎలాంటి ఉత్పాతం జరగకపోవటమే నిదర్శనం.

ఆర్థిక అక్రమాలను అడ్డుకుంటే ఊరుకోవు

ఏ ప్రభుత్వమైనా ఆర్థిక అక్రమాలను అరికట్టేందుకు చర్యలు తీసుకుంటే రేటింగ్ ఏజన్సీలు సహించవు. ఎందుకంటే వాటి అక్రమాలు ఎంతగా జరిగితే వాటి ఆదాయం అంతగా పెరుగుతుంది కనుక. అమెరికాలోని జార్జియా రాష్ట్రం ఆర్థిక అక్రమాల నివారణకు 2003 జనవరి 12న ఒక బిల్లును ఆమోదించింది. నాలుగురోజుల తరువాత స్టాండర్డ్ అండ్ పూర్ కంపెనీ బహిరంగంగా ఒక ప్రకటన చేసింది. అవినీతి తనఖా బ్రోకర్లు, రుణం ఇచ్చిన వారిపై పెద్ద మొత్తంలో జరిమానాలు విధించే ఈ బిల్లును చట్టంగా మార్చితే తాము రాష్ట్రానికి ట్రిపుల్ ఏ రేటింగ్ ఇవ్వబోమని స్పష్టం చేసింది. తరువాత మూడీస్, ఫిచ్ సంస్థలు కూడా ఇదే రకంగా బెదిరించాయి.

అమెరికా పరపతి తగ్గింపు వెనుక.....

అమెరికా ప్రభుత్వ పరపతిని తగ్గించి దానిని ఇబ్బందులలో పెట్టాలని స్టాండర్డ్ అండ్ పూర్ కంపెనీ కలలో కూడా తలపెట్టదు. మరి అలాంటిది ఆగస్టు 8న ఎందుకలా ప్రకటించింది? ప్రభుత్వ విధానాలు గనుక ఇదే విధంగా ఉంటే తాను రేటింగ్‌ను తగ్గిస్తానని అంతకు ముందే ప్రకటించింది. దీనికి వెనుక పెద్ద రాజకీయమే ఉంది. బడ్జెట్‌లోటు తగ్గింపు గురించి పార్లమెంట్ ఉభయ సభలు మల్లగుల్లాలు పడిన విషయం తెలిసినదే. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని రిపబ్లికన్లు ధనికులపై పన్ను పెంచకుండా, పేదలపై భారం మోపకుండా బడ్జెట్‌లోటు తగ్గించాలని చెప్పారు. పేదలపై భారం మోపటం, సామాజిక భద్రత, మెడికేర్ పథకాలకు నిధుల కోత వంటి చర్యల ద్వారా బడ్జెట్‌లోటు పూడ్చుకోవాలని ఒబామా సర్కారుపై వత్తిడి తెచ్చేందుకే రేటింగ్‌ను తగ్గిస్తానని ఎస్అండ్‌పి బెదిరించింది. రాబర్ట్ బరో అనే నయాఉదారవాద ఆర్థిక వేత్త వాల్‌స్ట్రీట్ జర్నల్ పత్రికలో రాసిన వ్యాసంలో ఇదే విషయాన్ని స్పష్టంగా చెప్పారు. కార్పొరేట్ కంపెనీలు, ధనికులపై పన్నురేటు తగ్గించాలని ఇటీవలి కాలంలో ఒబామా సర్కార్‌పై వత్తిడి పెరిగింది. ప్రపంచమంతటా ఇదే ధోరణి. తానెందుకు రేటింగ్ తగ్గించిందీ వివరిస్తూ ఎస్అండ్ పి కంపెనీ ఎనిమిది పేజీల వివరణ ఇచ్చింది.' ఆదాయాలను పెంచే ఏ చర్యనైనా పార్లమెంట్‌లోని మెజారిటీ రిపబ్లికన్లు అడ్డుకుంటున్నారు. చట్టాన్ని పక్కన పెట్టే ఇటువంటి స్థితి పార్లమెంట్‌లో ప్రబలిందని మేం నమ్ముతున్నాం, అందువలన పరపతిపై మా అంచనాను మార్చుకున్నాము.' రుణపరిమితి పెంపుదల ఒప్పందపై సంప్రదింపులకు ఏర్పాటు చేసిన ముగ్గురు సెనెటర్లతో కూడిన ఒక కమిటీలో సభ్యుడుకూరు ఎస్అండ్‌పూర్ వైఖరితో ఏకీభవిస్తూ సామాజిక భద్రతా పథకాలను నిలిపివేయటం కూడా ఒక విధమైన సంక్షేమ పథకమే అంటూ వాటిని అమలు జరిపి ప్రభుత్వం బొక్కసాన్ని ఖాళీ చేసుకుంటే వాల్‌స్ట్రీట్‌లో పెద్దలను గట్టెక్కించటం ఎలా అని ప్రశ్నించాడు. వాల్‌స్ట్రీట్ జర్నల్ ఒక వ్యాఖ్యానం చేస్తూ ' అన్నీ సక్రమంగా ఉండే ప్రపంచంలో ఎస్అండ్ పూర్ కంపెనీ ఉనికే ఉండదు, అదొక్కటే ఏమిటి దాని ప్రత్యర్థులైన మూడీస్,ఫిచ్ కంపెనీలు కూడా ఉండవు, మిగతా విషయాల్లో ఎలా ఉన్నా కనీసం కార్పొరేట్, ప్రభుత్వ బాండ్లకు ప్రపంచ న్యాయమూర్తులు, న్యాయపీఠాలుగా ఉండలేవు.' అంటే రేటింగ్ ఏజన్సీలు కార్మికులు, ఉద్యోగులు, మొత్తం పేదలకు వ్యతిరేకమైన నిర్ణయాలు తీసుకొనేందుకు'అభిప్రాయం' పేరుతో ప్రభుత్వాలను వత్తిడి కూడా చేస్తాయన్నది స్పష్టం.

- ఎం.కోటేశ్వరరావు

ఆరోగ్యం



మన దేశంలో పదేళ్ల క్రితంతో పోల్చుకుంటే ఇప్పుడు దీర్ఘకాల వ్యాధులతో బాధపడేవారి సంఖ్య రెట్టింపైంది. ఇంటర్నేషనల్ డయాబెటిస్ ఫెడరేషన్ ప్రకారం మన దేశంలో 5 కోట్ల మంది మధుమేహ వ్యాధిగ్రస్తులున్నారు. 2030 నాటికి ఈ సంఖ్య 8 కోట్లకు చేరే అవకాశముందని అంచనా వేసింది. మార్కెట్ సూత్రం ఏం చెబుతుందంటే... డిమాండ్‌ను బట్టి సరఫరా ఉంటుంది. ఒక వస్తువు మార్కెట్‌లోకి వచ్చినప్పుడు దాని ధర ఎక్కువ వుంటుంది. డిమాండ్ పెరిగేసరికి ఉత్పత్తి కూడా పెరుగుతుంది. ధర కూడా తగ్గుతుంది. అనేక రంగాల్లో మనం దీన్ని చూడవచ్చు. కానీ ఔషధ రంగంలో మాత్రం దీనికి విరుద్ధంగా జరుగుతోంది. రోగుల సంఖ్య పెరిగి, మందుల కొనుగోళ్లు పెరిగినా మందుల ధరలు తగ్గడం లేదు. పైగా ప్రతీ బ్యాచ్‌కు ధరను పెంచుతున్నారు. దీర్ఘకాలం వాడే ఔషధాలకి అధిక ధరలను నిర్ణయించి వాటిని పేద ప్రజలకు అందుబాటులో లేకుండా చేస్తున్నారు. హెచ్ఐవి, ఎయిడ్స్, గుండె జబ్బులు, ఇతర దీర్ఘకాల వ్యాధుల ఔషధాల్ని అధిక ధరలకు విక్రయిస్తున్నారు.

రోగులను చావబాదుతున్న మందుల కంపెనీలు

- వి.నవీన్ కుమార్

ఔషధ ధరలతో ప్రమేయం లేకుండా, భారత దేశ మొదటి ఔషధ విధానాన్ని 1978లో రూపొందించారు. ఆ తర్వాత 1979లో ఔషధ ధర నియంత్రణ ఆదేశం కూడా (డ్రగ్ ప్రైసెస్ కంట్రోల్ ఆర్డర్) అమల్లోకి వచ్చింది. ప్రభుత్వరంగ కంపెనీలకు ప్రాధాన్యతనిస్తూ, భారత జాతీయరంగ ఔషధ కంపెనీ అభివృద్ధికి తోడ్పడే ఉద్దేశంతో దీన్ని తీసుకొచ్చారు. ఫలితంగా జాతీయ ఔషధ కంపెనీలు, బహుళజాతి గుత్త సంస్థలతో విజయవంతంగా పోటీపడటంతో, బహుళజాతి కంపెనీల వాటా ఒక దశాబ్దంలో 80 శాతం నుంచి 24 శాతానికి పడిపోయింది. పాలసీ అమల్లోకి వచ్చిన ఐదేళ్లలో ఔషధాల ధరలు కూడా తగ్గాయి. ప్రభుత్వ రంగ ఔషధ కంపెనీలకు ప్రాధాన్యత తగ్గించింది. దీంతో ఈ కంపెనీలన్నీ నష్టాలబారినపడి మందగమనంతో కొనసాగి, మూతపడ్డాయి. గతంలో 387 భారీ ఔషధాలపై ధరల నియంత్రణ ఉండగా ప్రస్తుతం ఆ సంఖ్యని 74కి ప్రభుత్వం తగ్గించింది. ధరల నిర్ణయానికి సంబంధించి ప్రభుత్వం ఇప్పటికీ మార్కెట్ శక్తులపైనే ఆధారపడుతోంది. ఒకే రకమైన ఔషధాల ధరలు వేర్వేరు బ్రాండ్లలో చాలా ఎక్కువ వ్యత్యాసం ఉండటాన్ని ప్రభుత్వం ఇప్పటికీ గుర్తించకుండా ఉపేక్షిస్తూ ఉంది. వందల కొద్దీ ఔషధ కంపెనీలు, అవి ఉత్పత్తి చేసే ఔషధాల ధరల గరిష్ట పరిమితిని ఉల్లంఘించటం గురించి నిర్దిష్టమైన అనేక ఫిర్యాదులు వచ్చినప్పటికీ, ప్రభుత్వం ఇంతవరకూ తగిన దిద్దుబాటు చర్య తీసుకోలేదు.



ఎందుకీ సమస్య?

మందుల ధరలు పెరగడానికి ప్రధాన కారణం ప్రభుత్వం ఔషధాల ధరల నియంత్రణ, ప్రజారోగ్య బాధ్యత నుంచి తప్పించుకోవడం. 74 మందులకు మాత్రం ధర నిర్ణయిస్తుంది. ఇందులో కూడా అత్యవసర మందులు తయారుచేసే కంపెనీలు ఏదో ఒకటి కలిపి కాంబినేషన్ పేరుతో ఆ నిబంధన నుంచి బయటికి తీసుకొచ్చి కొత్త మందును చేస్తున్నాయి. ఉదాహరణకు సెల్బొటమాల్. దీన్ని ఆయాసం తగ్గించడానికి వాడతారు. సెల్బొటమాల్‌తో పాటు బ్రొమెక్సిన్ కలిపి కాంబినేషన్ మందు తయారు చేసి పాత ధర కంటే ఎక్కువ ధరకు అమ్ముతున్నారు. అలాగే యాంటి బయాటిక్ మందు అమాక్సిసిలిన్. దీనికి లాక్టొబాసిల్లస్ కలిపి కాంబినేషన్ తయారు చేస్తారు. ఇది 74 మందుల జాబితాలో ఉండదు. కాంబినేషన్ పెట్టకూడదనే నిబంధన ఇందులో లేదు. అందుకే మందుల కంపెనీలు చట్టాల్ని ఉల్లంఘిస్తున్నాయి.

ప్రభుత్వం ఇంత వరకు జాతీయ అత్యవసర మందులను నోటిఫై చేయలేదు. దానిపై సుప్రీంకోర్టు ఆదేశంతో 354 మందులతో అప్పటికప్పుడు ఒక జాబితా తయారు చేసింది. డ్రగ్స్ అంటే హెరాయిన్, బ్రౌన్‌షుగర్ అని అనుకుంటారని ఎసెన్షియల్ మెడిసిన్ అని జాబితా రూపొందించింది. మన చట్టంలో ఎక్కడ చూసినా డ్రగ్ కంట్రోల్, డ్రగ్ డిపార్ట్‌మెంట్ అని పిలుస్తాం. ఎసెన్షియల్ డ్రగ్ అంటే ధరల నియంత్రణ ఆదేశం కిందికి వస్తాయి. దీన్నుంచి తప్పించుకోవడానికి ప్రభుత్వం మెడిసిన్ పేరును వాడుకుని కంపెనీలకు ప్రయోజనాన్ని చేకూర్చింది. ఈ జాబితా నుంచి కొన్ని మందులు తప్పనిసరిగా తయారు చేయాలని నిబంధన విధిస్తే వీళ్లు కూడా మందులు తయారు చేస్తారు.

ఇటీవల మన దేశంలో బిపి, మధుమేహం, మానసిక సమస్యల వంటి జీవనశైలి వ్యాధులు పెరుగుతున్నాయి. చిన్న వయసులోనే వ్యాధులు వస్తున్నాయి. ఈ సమస్యలతో బాధపడేవారు జీవితాంతం ఈ మందులు వాడాలి. వీటిని అత్యవసర మందుల జాబితాలోకి తీసుకురావాలి. కానీ కంపెనీలు ఈ రకం మందుల ధరలను విపరీతంగా పెంచుతున్నాయి.



జబ్బు	మందుపేరు	ధర(2010లో)	ధర 2011లో
రక్తపోటు	కార్డాస్ 5ఎంజి		
	లొసకిండ్ 50 ఎంజి	32.50	35.70
	రిప్లేస్ హెచ్	65.80	69.00
	ఎస్లోటన్	92.85	101.00
	అమ్‌టస్ 5ఎంజి	20.49	31.90
	రమిస్టర్ 2.5 ఎంజి	55.75	61.90
	ఓల్‌మెట్రక్	63.00	69.00
	సూపర్‌మెక్స్ ఎక్స్‌ఎల్	32.60	36.00
	ఎమెట ఎఎం 50	61.95	66.00
	రెవస్ ఎఎం 5 ఎంజి	54.00	56.50
మధుమేహం	డ్యుపిల్	28.35	31.00
	ట్రియోపిల్ 2ఎంజి	59.00	65.00
	జొరియల్ ఎం2	66.89	73.35
	జొరియల్ ఎం1	48.00	53.50
	అజులిక్స్ ఎ ఎంజి	41.50	45.50
	అజులిక్స్ 2 ఎంజి	49.00	53.00
	గ్లైకొమెట్ జిపి 2ఎంజి	57.00	60.00
	ట్రిగ్‌జిపిఎం 2ఎంజి	71.00	82.00
కొలెస్ట్రాల్	అటొకర్ 10 ఎంజి	81.00	89.00
	అటొకర్ 20 ఎంజి	99.00	108.00
	లిప్‌కర్డ్	85.50	93.50
రక్తహీనత	ఒరొఫెర్ ఎక్స్‌టి	71.00	80.00
మల్టీవిటమిన్	జింకోవిట్	70.00	84.50
గుండె శస్త్రచికిత్స తర్వాత			
	నిట్రొకొనిటిన్	104.00	114.30

✶

అత్యవసర జాబితాలోకి 'జీవనశైలి మందులు'

సంక్రమిత వ్యాధులతో మరణించే వారికన్నా అసంక్రమిత వ్యాధులు.. మధుమేహం, అధిక రక్తపోటుతో మరణించే వారి సంఖ్య ఎక్కువని ఇటీవల ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. మన దేశంలో సంభవించే పది మరణాల్లో ఎనిమిది సంక్రమితం కాని వ్యాధులు వల్లే సంభవిస్తున్నాయని తేల్చింది. బెంగళూరు, చెన్నై నగరాల్లో జీవన శైలి వ్యాధుల తీవ్రత ఎక్కువ వుందని కేంద్ర ఆరోగ్యశాఖ తెలిపింది. బెంగళూరులో 14 మంది మధుమేహం, 21శాతం అధిక రక్తపోటుతో బాధపడుతున్నారని పేర్కొన్నది. అసంక్రమిత వ్యాధుల తీవ్రత పెరుగుతోంది. ఈ వ్యాధుల బారినపడ్డవారు జీవితాంతం మందులు వాడాల్సిందే. ఇదే అదనుగా ఔషధ కంపెనీలు మందుల ధరలను పెంచేస్తున్నారు. జాతీయ అత్యవసర మందుల జాబితాలో జీవన శైలి మందులను తీసుకొస్తే ధర తగ్గే అవకాశముంది.

- ఎజి రాజమోహన్,
జనరల్ సెక్రటరీ,
ఎపి మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్.

ధరలు మూడు రెట్లు పెరిగాయి

నాకు 2000 సంవత్సరం నుంచి మధుమేహం ఉంది. అప్పటికీ ఇప్పటికీ మధుమేహ చికిత్సకయ్యే ఖర్చు మూడు రెట్లు పెరిగింది. అప్పట్లో నెలకు 400 నుంచి 500 రూపాయల దాకా ఖర్చు అయ్యేది. మధుమేహ రక్త పరీక్ష చేయించుకోవడానికి అప్పట్లో రూ.30 ఖర్చయ్యేది. ఇప్పుడు ఇది రూ.60 నుంచి 70కు పెరిగింది. నేను ఇన్సులిన్ పెన్‌ను వాడుతున్నాను. సిరంజితో కలిపి దీని ధర రూ.380. నెలకు నాలుగు వాడతాను. నాలుగింటికి రూ.1536 ఖర్చు. మందులు, పరీక్షలకు రూ.1500 అవుతుంది. మందుల ధరలు పెరగడంతో సొంత ఖర్చు తగ్గించుకున్నాను.

కె.శివారెడ్డి,
వ్యవసాయదారుడు.

హాస్య బ్రహ్మాస్త్రం



కందుకూరి వీరేశలింగం అనగానే వితంతు పునర్వివాహాలు చేసిన సంఘసంస్కర్త కళ్ల ముందు కదలాడతారు. కానీ సమాజంలోని ప్రతి చెడునూ ఆయన హాస్యభరితంగా చెప్పిన ప్రహసనాలు ఆచారాలతో కమ్మిన పొరలను తొలగిస్తాయి. ఆచారాల మాటున జరుగుతున్న మూఢాచారాలను, డంభాచారాలను ఆయన తన ప్రహసనాల్లో పటాపంచలు చేశారు. పెద్దమనుషుల అల్పబుద్ధులను బద్దలు చేశారు. ఆనాడు అవిధంగా రాయడం సాహసమే. ఈనాటికీ వాస్తు, శకునాలు, సాంప్రదాయాల పేరిట సాగుతున్న దురాచారాలు మనం చూస్తూనే ఉన్నాం. అలాంటి వాటిపై వీరేశలింగం పంతులుగారు ఆనాడే ఎంతో విశ్లేషణాత్మకంగా, వినోదభరితంగా చెప్పినతీరుకు విస్తుపోకుండా ఉండలేం. నాడు ఆయన చేసిన కృషి నేటికీ మార్గదర్శకమే. ఇంత సంక్లిష్టమైన, సునిశితమైన విషయాలపై హాస్యభరితంగా చెప్పడం ఆయనకే సాధ్యమనిపిస్తోంది. ఆ ప్రహసనాలు చదువుతుంటే ఒకదాన్ని మించి ఒకటి విజ్ఞానపు వెలుగుల్ని చిమ్ముతున్నాయి. మడి స్నానాల గురించి ఇద్దరు ఆడవాళ్ల మధ్య సంభాషణను 'ఆచారం'లో చెప్పినవి అక్షరసత్యాలు. మూఢత్వానికి, ఛాదస్తానికి నిలువుటద్దాలు. 'అపాత్రదానము'లో దానం తీరును ఎండగడుతూనే దానం పొందేవారి దురుద్దేశాలను, దుశ్చేష్టలను వెల్లడించారు. 'గురు శుశ్రూష'లో గురువు శిష్యులను తన స్వకార్యాలకు వినియోగించుకోవడాన్ని ఎంతో చమత్కారంగా చెప్పారు. వారికి జ్ఞానం కలగడమేమోగానీ.. చోరీలు చేయించడాన్ని ప్రస్తావిస్తూ అటువంటి గురువులకు చురకలు అంటించారు. తెలకపల్లి రవిగారు ముందుమాటలో 'వేశ్యాలోలత్వం, బాల్యవివాహాలు, బహుభార్యత్వము, ప్రజా ధనాపహరణం, టక్కరితనం, పటాటోపం వంటి సాంఘిక జాడ్యాలకు పాల్పడేవారి పోకడలనూ తూర్పారపట్టే పలు సంభాషణాత్మక ప్రహసనాలను గురజాడ అందించారన్న' విశ్లేషణ సముచితం. 'కులాభిమానం'లో కులతత్వాలను నాడే ఆయన ప్రస్తావించడం దానికున్న పునాది ఎంత బలమైందో తేటతెల్లం చేసినట్లయ్యింది. మున్సిపాలిటీ కాంట్రాక్టుల్లో కమీషన్ల గురించి ఆయన విశ్లేషించిన తీరు నేటి అవినీతికి నాడే బీజాలు పడ్డాయన్న వాస్తవం ఆవిష్కరించినట్లైంది. నేటి ప్రమాణాలతో పోలిస్తే ఇందులో భాషా ప్రయోగం కొద్దిగా ఇబ్బంది అనిపించినా ఆనాటి చారిత్రక పరిస్థితిని, ఆలోచనా ధోరణులను తెలియజేసేవిగానే చూడాలి. 'కోపోద్రేకము చేత నా చిత్తము నాకు వశము గాక హాస్య రస ప్రవాహము వెల్లువగా బారెను. అందు ఉపయోగించిన నిందాగర్భితములైన వాక్యములు సువిచార స్థితి యందు నేను ఉపయోగింపదగనివే వున్నవి' అని ఒక సభను ఉద్దేశించి చేసిన ప్రసంగంపై ఆయనే రాసుకున్నారు. ఈ లక్షణం ప్రహసన భాషలోనూ అక్కడక్కడ మనకు కనిపిస్తూనే ఉంటుంది. వీరేశలింగం కలం నుంచి జాలువారిన ఈ 'హాస్య సంజీవనిని' పాఠకలోకానికి అందిస్తూ వారిలో జ్ఞానోదయానికి తమ వంతు బాధ్యతను నెరవేర్చిన 'ప్రజాశక్తి బుక్‌హౌస్' వారు అభినందనీయులు. మూఢనమ్మకాల గురించి ఆవేశపూరితంగా చెప్పేకన్నా ఇలాంటి 'హాస్య బ్రహ్మాస్త్రం' చాలు. ఏదోమేర ఫలితం కలిగిస్తుంది. నేటికీ కొనసాగుతున్న సామాజిక వివక్షను చూడాలన్నా, అరికట్టాలన్నా ఈ పుస్తకం ప్రతి ఇంటా ఉండడం సముచితం.

మూఢనమ్మకాలు, దురాచారాలపై బ్రహ్మాస్త్రం,
హాస్య సంజీవని - కందుకూరి వీరేశలింగం పంతులు,
పేజీలు : 182, వెల: రూ.80,
ప్రతులకు: ప్రజాశక్తి అన్ని బ్రాంచీలు.

- శాంతిశ్రీ

కొత్త పుస్తకాలు

ఆహ్లాదం...ఆనందం...

ఈ హాస్యోక్తుల్ని సంకలనం చేసిన మువ్వల సుబ్బరామయ్య గార్ని అభినందించాలి. కుటుంబ సభ్యులంతా ఇంట్లో కూర్చొని హాయిగా నవ్వుకొనే సదవకాశం ఈ పుస్తకం ద్వారా కల్పించారు. హాస్యం అనగానే సాహిత్యంలో మనకు మొట్టమొదటగా గుర్తుకొచ్చేవారు హాస్య బ్రహ్మ భమిడిపాటి కామేశ్వరరావు గారు. ఎందుకనో వారి రచనలకు ఈ పుస్తకంలో పెద్దగా ప్రాధాన్యత ఇవ్వలేదు. పన్నాల సుబ్రహ్మణ్య భట్టు ముందుమాటలో అన్నట్లుగా ఈ హాస్యరత్నాకరంలోని రత్నాలను మువ్వల సుబ్బరామయ్యగారు పోగు చేసి చూపారు. ఇష్టం, కష్టం ఆయనది. ఆనందం మనది- ముందు తరాలది సందేహం లేదు. వాస్తవమే! ఈపుస్తకంలో కాళ్లకూరి నారాయణరావు "వర విక్రయం, చింతామణి, మధుసేవ, మల్లాది రామకృష్ణశాస్త్రి గృహిణీ పదమ్, పానుగంటి లక్ష్మీనరసింహారావు" కంఠాభరణము, సాక్షి, కందుకూరి వీరేశలింగం గారి బ్రహ్మవివాహం, గురజాడ "కన్యాశుల్కం"లోని పాత్రలు, హాస్యం మనల్ని కడుపుబ్బ నవ్విస్తాయి. గిరీశం (కన్యాశుల్కం), దామోదరుడు (చింతామణి), పెండ్లిండ్ల పేరయ్య (వరవిక్రమం), జంఝాలశాస్త్రి (సాక్షి), లుబ్ధావధానులు(కన్యాశుల్కం), కరటకశాస్త్రి, మధురవాణి పాత్రలు, కాంతం (మునిమాణిక్యం నరసింహారావు రచన), నవ్వులగని (చిలకమర్తి లక్ష్మీనరసింహం), శ్రీశ్రీ, కుందర్తి హాస్యాలు (పేజీ 121) టాంగ్ టూటీ పీర్ ఖాసిం (టంగుటూరి ప్రకాశం) ఉర్దూ లిపిలో చదివితే పేరు అలా వుంది(ట). (పేజీ 137) పోలీసుల కళ్ళుగప్పి ప్రకాశం గార్ని క్షేమంగా రాష్ట్రం వదిలి పంపడం జరిగిందట... అలాగే మహనీయుల హాస్యోక్తుల పేజీ 146-159 దాకా ఇచ్చారు. బాగున్నాయి. నవ్విస్తాయి. ఉదా:- "అమ్మా! నీ అల్లుడు వచ్చాడంటే: నన్నేమి చేస్తాడమ్మా : నిన్నే తీసికెళ్తాడు అందట. అన్న వస్త్రాలకు పోతే ఉన్న వస్త్రం ఊడిపోయిందట. మన తెలుగు సాహిత్యంలో ఎందరో మహా కవులు హాస్యరసాన్ని పండించారు. మన కాలంలోని జంధ్యాల హాస్యోక్తులు కూడా ఈ పుస్తకంలో ఇస్తే ఇంకా బాగుండేది. ఏదేమైనా కాలంతో పరుగులు పెట్టే ఈ ప్రపంచీకరణ పీడనలో కొంతసేపైనా నాటి హాస్యసాహిత్య పాత్రల్ని చదువుతూ ఆహ్లాదం, ఆనందం పొందవచ్చు ఈపుస్తకం చేతిలో వుంటే!

తెలుగు సాహిత్యంలో హాస్యోక్తులు
మువ్వల సుబ్బరామయ్య,
పేజీలు 160, వెల. 70రూ,
ప్రతులకు మువ్వల పెరుమాళ్ళు అండ్ సన్స్, 29-13-19/3,
మల్లికాంబవీధి సూర్యారావుపేట,
విజయవాడ-2, ఫోన్: 8978261496.

-తంగిరాల చక్రవర్తి

ముదిరిన మేడిన్ చైనా పిచ్చి



పిచ్చి ముదిరినోడు రోకలి తలకు చుట్టమన్నాడట. అమెరికన్లకు నోటి కాడి నుంచి కాటి కాడి వరకు 'మేడిన్ చైనా' వస్తువులు లేకపోతే గడవదు. అలాంటి అమెరికన్లలో కమ్యూనిస్టు వ్యతిరేక పిచ్చిని కూడా బాగానే ఎక్కించారు. ఆఫ్రో-అమెరికన్ హక్కుల నాయకుడు 'జూనియర్ మార్టిన్ లూథర్ కింగ్' విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని బిల్‌క్లింటన్ హయాంలో నిర్ణయించారు. 'ఇష్టంలేని పెళ్లిలో తలంబ్రాలు' పోసినట్లుగా 1996లో క్లింటన్ చేసిన నిర్ణయం 15 సంవత్సరాల తరువాత ఒబామా హయాంలో కార్యరూపం దాల్చింది. నాలుగెకరాల స్థలమైతే కేటాయించారు గాని విగ్రహానికి అవసరమైన కోటి డాలర్లను '2005'లోగాని కేటాయించలేదు. అదీ తొలుత నల్లజాతీయులు, తరువాత కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా కూడా సర్కార్ పెంచి పోషించిన 'క్లూక్లక్స్‌క్లాన్' నేరగాళ్ల ముఠాల్లోని మాజీ సభ్యుడైన సెనెటర్ రాబర్ట్ డి బైర్డ్ ప్రవేశపెట్టిన తీర్మానం ద్వారా సవరణ బడ్జెట్‌లో కేటాయించారు. విగ్రహాన్ని చైనాలో మావోసేటుంగ్ విగ్రహాల శిల్పి లి ఇక్సిన్ ద్వారా తయారు చేయించారు. అయితే కొందరు పత్రికల వారికి ఆ విషయం తెలియగానే వారి కళు 'ఎర్రబైర్లు' కమ్మాయి. ఇంకే ముంది మార్టిన్ లూథర్ కింగ్ విగ్రహం సగం చైనీయుల మాదిరిగా కనిపించటం ప్రారంభించిందట. ఒక బ్రిటన్ పత్రికైతే ఏం అమెరికాలో విగ్రహాలు తయారు చేసే వారే దొరకలేదా అని రెచ్చగొట్టింది. కింగ్‌ను అమెరికా సామ్రాజ్యవాదులే హత్య చేయించారని అప్పుడు చైనా ప్రకటించిందని, అలాంటి దేశ శిల్పి చేత తయారు చేయిస్తారా అని 'చెడ్డరాతలు' రాశారు. అమెరికాలో మృగ్యమైన మానవహక్కుల కోసమే బలైపోయిన మార్టిన్ లూథర్ కింగ్ విగ్రహ ఆవిష్కరణ సందర్భాన్ని కూడా అక్కడి శ్వేత జాతి దురహంకారులు ఎలా ఉపయోగించుకున్నారో చూడండి. అయితే కమ్యూనిస్టు వ్యతిరేకత పిచ్చి'వైరస్' సోకిన నల్లవారు కూడా ఇలాంటి బాపతుతో 'గొంతు' కలపటమే విషాదం. ఇంతకూ ఈ విగ్రహాన్ని ఆగస్టు 28న ఒబామా ఆవిష్కరించారు.

పేరులోనే పెన్నిధి

'పేరులోనేమున్నది పెన్నిధి' అంటారు.ఆ పేరుకోసం ఎన్నో 'నిధులు' ఖర్చవుతాయి. పేరు చూసి మనం 'ముచ్చట' పడతాము గాని అందుకయిన 'ఆముదాన్ని' మనమే పూసుకుంటామని తెలియని అమాయకులం మనం అంటే కొందరికి కోపం రావచ్చుగాని నిజం. అబోత్తాబాద్‌లోని 'ఒసామాబిన్ లాడెన్'లో దొరికిన పత్రాలలో తమ సంస్థ పేరు మరింతగా మోగటానికి రూపొందించిన పథకాలలో మరిన్ని దాడులకు బదులు' ఆల్ ఖైదా' అవసరం గురించి ప్రపంచానికి ఎలా చెప్పాలా అన్న పథకాలు ఉన్నాయట. రష్యన్ కెజిబి ఇప్పుడు 'ఎఫ్ఎస్‌బి'గా పేరు మార్చుకుంది. వయస్సు పైబడిన సినీ నటీనటులు తమ పట్టునిలుపుకొనేందుకు కొత్త బ్రాండ్లతో ప్రయత్నించటం తెలిసినదే. ఈ పిచ్చ కార్పొరేట్ రంగంలో మరీ ఎక్కువ. 'ఇతర బ్రాండ్ల' పోటీని తట్టుకోవటానికి, వర్తమాన బ్రాండ్‌లోని వ్యతిరేకార్థాన్ని తొలగించుకొనేందుకు, మార్కెట్ వాస్తవాలకు అనుగుణంగా మారేందుకు, దివాళా వంటి పరిణామాలు జరిగినపుడు పేరు మార్చుకోవటానికి ప్రయత్నిస్తారు.

ఊబకాయంతో ఆయాస పడే వారిని మెక్‌డోనాల్డ్ బేబీ, బాబు అని పిలవటం ప్రారంభించటంతో ఆ కంపెనీకి 'దిమ్మ తిరిగి' అబ్బే అబ్బే మా ఉత్పత్తులు ఆరోగ్యవంతమైనవంటూ పెద్ద ఎత్తున ప్రచారం ప్రారంభించటంతో పాటు సన్నగా స్లిమ్‌గా ఉంచే ఉత్పత్తులను తమ ప్రకటనలలో ప్రదర్శించటం ప్రారంభించింది. 'ఓల్డ్ స్పైస్' అనగానే కుర్రకారు అరే ఇది మా తండ్రులు, తాతలు వాడిన సరుకన్నట్లుగా భావించటంతో తన పంథా మార్చుకుంది. ఫొటో కాపీకి మారు పేరుగా జిరాక్స్, హీరో హోండా అంటే మోటార్ సైకిల్ అన్న పర్యాయపదాలుగా మారాయి. హీరో హోండా నుంచి హోండా కంపెనీ తప్పుకోవటంతో 'హీరో' కంపెనీ తనదైన బ్రాండ్‌కోసం తిప్పలు పడుతోంది. అందుకోసం వంద కోట్ల రూపాయలు కేటాయించిందట. అయితే కొన్ని కంపెనీలకు 'వ్రతం చెడ్డా ఫలం దక్కటం లేదు'ట.మూడు వందల కోట్ల రూపాయలు ఖర్చు చేసిన ఎయిర్‌టెల్‌కు చివరకు ఏముంది లోగో మార్పు తప్ప అని జనం చప్పరించేశారు. అమెరికాలో అనేక 'మందిని ముంచి దివాళా' ప్రకటించిన . ఏఐజి కంపెనీ ఒబామా సర్కార్ నుంచి భారీగా ఉద్దీపన నిధులు పొందింది. అయినా పాత పేరు 'అచ్చి'రాదని భావించి 'సేజ్‌పాయింట్ ఫైనాన్షియల్' అని మార్చుకుంది.

టైర్లు ఊడిపోయినా పరుగెత్తే ఒబామా బస్

బస్సంటే బస్సా అది, తస్సాదియ్యా, నాలుగున్నర కోట్ల రూపాయలల ఖరీదు .ఎంతసేపూ మనకు మనడొక్కు ఆర్‌టిసి బస్సులే గుర్తుకొస్తాయి. అమెరికా అధ్యక్షుడు ఒబామా ఎన్నికల రథం అంటే మాటలా!!. అమెరికన్లు తమ ఆర్థిక ఇబ్బందుల కంటే ఒబామా బస్సు 'అందచందాల' గురించి ఎక్కువ ఆసక్తితో ఉన్నారట. ఈ బస్సును ఎలా తయారు చేశారంటే అది సీక్రెట్ అడగొద్దు అంటున్నారట. ఆ బస్సు టైర్లు ఊడిపోయినా ఆగకుండా మిలిటరీ టాంక్ మాదిరి అలాగే పరిగెడుతుందట. బుల్లెట్లను లెక్క చేయదట. అదే మరి బ్యాలెట్ల కోసం వెళుతూ బుల్లెట్ల ప్రస్తావన ఎందుకని ఎవరైనా అనుకోవచ్చు. ఎంతైనా ప్రపంచ దేశాలన్నింటా విరోధులను తయారు చేసుకున్న దేశానికి . అధ్యక్షుడన్న తరువాత ఆ మాత్రం 'భయం' లేకుండా ఉంటుందా?

బ్రాందీ కేంద్రంగా మారిన'గాంధీ' దీక్షా స్థలం

డెబ్బైనాలుగు సంవత్సరాల కిసాన్ బాబూరావ్ హజారే(అన్నా హజారే) రామలీలా మైదాన దీక్ష 'విరమణ' ఎప్పుడు జరుగుతుందా అని ఎదురు చూసిన వారు కొందరు, ఇంకా కొంతకాలం కొనసాగిస్తే బాగుండు అనుకున్నవారు మరి కొందరు, ఎందుకంటే దీక్ష చేస్తున్నది తాము కాదు కదా! అన్నా దీక్ష గురించి ఎదురు చూసినవారు ఇంకొందరు. జనలోక్‌పాల్ బిల్లు గురించి వారికెలాంటి 'చింతా' లేదు. అటు అన్నా దీక్ష విరమించి అక్కడ నుంచి లేచి వెళ్లారో లేదు. ఆ స్థానాన్ని వారు ఆక్రమించారు. అంటే దీక్ష కొనసాగించటానికి కాదండోయ్ ! ఈ ముసలాయన దీక్ష చేపడతారన్న దగ్గర నుంచి మాకు 'మందుకొట్టే మంచి ప్రదేశం' లేకుండా పోయింది, ఎప్పుడు ముగిస్తారు లేక పోతే ముగింప చేస్తారా అని 'కళ్లలో వత్తులకు' బదులు 'చేతుల్లో బాటిళ్లు' పట్టుకుని ఎదురు చూసిన తాగుబోతులు వారు. పదమూడు రోజుల గాంధీ అంతటి వ్యక్తిగా పేరుగాంచిన అన్నా దీక్ష, జాతీయ ఉద్యమానికి కేంద్రంగా మారిన ఆ స్థలం కొద్ది గంటల్లోనే 'బ్రాందీ' కేంద్రంగా ఎలా మారిపోయింది !!

- ఎం. కోటేశ్వరరావు

తలను గుండ్రంగా తిప్పే పక్షి

ఈ వారం మనం తెలుసుకోబోయే పక్షి పేరు చుక్కల పయిడిగంటి. ఇది చూడ్డానికి గుడ్లగూబలానే ఉంటుంది. కానీ దాని కంటే చాలా చిన్నది. గోధుమ రంగు శరీరంపై తెల్ల మచ్చలుంటాయి. దీని తల గుండ్రంగా, పెద్దగా వుంటుంది. రెప్పవేయకుండా చాలా తీక్షణంగా చూడగలదీ పక్షి. మామిడి, మర్రి చెట్ల తొర్రల్లో నివాసమేర్పరచుకుంటుంది. ఎవరైనా దానిచుట్టుపక్కల శబ్దం చేస్తే ఏమిటా చప్పడని గూట్లోనుండి తొంగి చూస్తుంది. తల ముందుకూ వెనుకకూ ఆడించడమే కాదు, తలను పూర్తిగా గుండ్రంగా తిప్పుతుంది. ఇది గుడ్లగూబలా నిశాచరమే. సాధారణంగా సంధ్యాసమయంలో, రాత్రి సమయాల్లోనే బయటికి వస్తుంది. ఇసుక్కు, వీధిలైట్ల దగ్గరుండే పెంకు పురుగులు దీని ఆహారం. వీటినే కాకుండా తొండలు, చిట్టెలుక పిల్లలను కూడా తింటుంది. రెండు పక్షులు ఒకేసారి అరిచినప్పుడు చూడాలి... అవి అరుస్తున్నాయా, లేదా పోట్లాడుకుంటున్నాయా అన్నట్లుంటుంది. ఇవి గుడ్లు పెట్టడానికి పాడు బడిన ఇళ్లను చూసుకుంటాయి. అవి అందుబాటులో లేనప్పుడు నివాసమున్న ఇళ్లను కూడా ఎన్నుకుంటాయి.



బాలనేస్తాలు

క్విజ్ మాస్టర్

1. ఆకులకు పచ్చరంగు ఎలా వస్తుంది?
2. క్యారెట్లకు ఆ రంగు ఎలా వస్తుంది?
3. రక్తానికి ఎరుపురంగు దేనివల్ల వస్తుంది?
4. మనిషి శరీరంలో ఎన్ని ఎముకలుంటాయి?
5. మనిషి మెదడు బరువెంత?

- ఇంజమామ్ షరీఫ్, హైదరాబాద్

జవాబులు: 1. పత్ర హరితంలో ఉండే క్లోరోఫిల్ అనే పదార్థం వల్ల ఆకులకు పచ్చరంగు వస్తుంది., 2 కెరోటిన్ వల్ల, 3. హిమోగ్లోబిన్, 4 206 పుట్టినప్పుడు 300 నుండి 350 వరకు ఉంటాయి. మనిషి పెరిగే క్రమంలో కొన్ని ఎముకలు కలిసిపోతాయి.5. పెద్దవాళ్లలో 1300 గ్రాముల నుండి 1400 గ్రాములుంటుంది. అప్పుడే పుట్టిన పిల్లల్లోనైతే 350 గ్రాముల నుండి 400 గ్రాములు ఉంటుంది.

మీరూ ఇలా 5 ప్రశ్నలు, జవాబులు రాసి పంపండి. ప్రచురిస్తాం. మా చిరునామా : క్విజ్ మాస్టర్, ఆదివారం అనుబంధం, ప్రజాశక్తి, ప్లాట్ నెం.21/1, ఎం.హెచ్ భవన్, ఆజమాబాద్, ఇండస్ట్రియల్ ఏరియా, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్-500020.

నేర్చుకుందామా...





ఎలా చేస్తే వస్తుంది?

ఫ్రెండ్స్... పైన కొన్ని గుర్తులు, అంకెలు ఉన్నాయి. వాటి సాయంతో 72-10X5=66÷3. అని చూపించాలి. అది ఏ వరుసలో చేస్తే వస్తుందో చేసి చూడండే!



అది ఏది?

చిన్నారులూ... పైన మూడు వరుసల్లో ఒకేలాంటి బొమ్మలు నాలుగు వున్నాయి. వాటిలో ప్రతి వరుసలో ఒక బొమ్మ తేడాగా ఉంది. అది ఏదో కనిపెట్టి సున్నా చుట్టండే!

జవాబు : 3,4,3

ఎక్కడున్నాయ్?

చూడండి పిల్లలూ... ఇక్కడున్న సర్కస్‌లో రెండు కుక్కపిల్లలున్నాయి. కానీ రింగ్ మాస్టర్‌కి గానీ, జోకర్‌కి గానీ అవి కనిపించలేదంట. మరి మీకైనా ఎక్కడున్నాయో తెలిసిందా? అయితే వాళ్లకి చెప్పి సాయం చేయండే!



సీసా బరువెంత?

ఒక సీసాలో తేనె ఉంది. సీసాతో సహా దాని బరువు 500 గ్రాములు. అదే సీసాలో తేనె తీసేసి కిరోసిన్ పోస్తే దాని మొత్తం బరువు 350 గ్రాములే వుంది. తేనె బరువు కిరోసిన్ బరువుకు రెండింతలు ఉంది. అయితే ఖాళీ సీసా బరువెంత?



రెండూ సమానమేనా?

ఒక దుంగ బరువు 30 కిలోలు. రెండో దుంగ దీనికి రెండింతలు లావుగా, దాని పొడవులో సగం ఉంటుంది. అయితే రెండవ దుంగ బరువు ఎంత?

		1		2	9			
	2	7	8					6
5						2		
		5	2	8				
	7			1			5	
				7	3	9		
		8						4
3					5	8	6	
			6	3		5		

సుడోకు నింపేద్దాం

నేస్తాలూ.. ఇక్కడ ఓ పెద్ద బాక్సు, అందులో తొమ్మిది చిన్న చిన్న బాక్సులు ఇచ్చాం. వాటిలో మళ్లీ తొమ్మిది గళ్లు ఉన్నాయి. కొన్ని గళ్లలో అంకెలు కూడా వున్నాయి. మీరేం చేయాలంటే చిన్న బాక్సుల్లో 1 నుండి 9 వరకు అంకెలు వేయాలి. వేసిన అంకె మళ్లీ వేయకూడదు. అలా తొమ్మిది చిన్న బాక్సులు నింపేయాలి.

సీసా బరువెంత? : సీసాలోని తేనె, కిరోసిన్ బరువుకి మధ్య తేడా 150 గ్రాములు. సీసా బరువు తెలియాలంటే కిరోసిన్‌తో ఉన్న సీసా బరువులో నుండి 150 తీసేస్తే వస్తుంది. అంటే 350 -150 =200. అంటే ఖాళీ సీసా బరువు 200 గ్రాములు. అంటే తేనె బరువు 300 గ్రాములు. తేనె రెండింతల కిరోసిన్‌కి సమానం. కనుక కిరోసిన్ బరువు 150 గ్రాములు అవుతుంది.

రెండూ సమానమేనా? : మొదటి దుంగ కంటే రెండో దుంగ రెండింతల లావు వుంది. రెండోదాని బరువు నాలుగింతలు పెరిగింది. అంటే 30X4=120 కిలోలు. కానీ మొదటిదాన్లో సగం పొడవే ఉంది కాబట్టి 120 కిలోల్లో సగం 60 కిలోలు ఉంది.

జవాబులు సుడోకు నింపేద్దాం

8	6	1	3	2	9	4	7	5
4	2	7	8	5	1	3	9	6
5	3	9	4	6	7	2	8	1
9	4	5	2	8	6	7	1	3
2	7	3	9	1	4	6	5	8
1	8	6	5	7	3	9	4	2
6	5	8	7	9	2	1	3	4
3	9	2	1	4	5	8	6	7
7	1	4	6	3	8	5	2	9

ఎలా చేస్తే వస్తుంది?



మాటల కోట - 68

రూపకల్పన : కర్లపాలెం

1		■	2	■	3	4		■
	■	5		6	■		■	7
8		■	■	9	10	■	11	
	■	12	13	■		■	14	
	■	■		■	■	15	■	
■	■	16		17				■
18		■	■		■		■	19
	■	20	21		■	22		
23		■		■	24		■	

అడ్డం :

1. కళ్లెం (2)
3. నాథుడు లేనిది (3)
5. మాండలికంలో 'మరీ ప్రియమైపోవడం' (3)
8. భారతం లేని మహా భారతం (2)
9. పది (2)
11. తువ్వాయిలా 'అమ్మా' అని పిలు (2)
12. రోమ్ తగలబడుతుంటే ఫిడేలు వాయించిన ఘనుడు (2)
14. భూమి, రేటు (2)
16. కావడికుండల వంటి సంపద, పేదరికం (6)
18. స్వాతంత్ర్యోద్యమంలో బాపూజీ తిప్పిన చక్రం (2)
20. పని లేకుండా తిరిగేవాడు (3)
22. చెదిరిపోయిన నెచ్చెలి (3)
23. దీనితో పండూ కోయవచ్చు, పీకా కోయవచ్చు (2)
24. పసిబిడ్డ (2)

నిలువు :

1. పేరు మారిన పశ్చిమబెంగాల్ (5)
2. పసిబిడ్డకు పాలతో కలిపి పోసేది (2)
4. కాయిన్ (2)
6. సంస్కృతంలో చెప్పు! (2)
7. హోస్నీ..., పారశీకంలో 'అభినందన' (4)
10. శతకంలో నూరు (2)
11. అంధభిక్షువు ముందు సగం (2)
13. రోలుతో పాటుగా చెప్పుకునేది (3)
15. వైకుంఠపాళి అంటే.... ఆట (5)
17. తినే తీపి పదార్థం (3)
18. తెలుగు, తమిళ ప్రసిద్ధ నటీమణి. జెమినీ టీవీలో ఎప్పుడూ ఈమె సీరియల్ ఒకటి ఉండాల్సిందే (3)
19. హిందీ యజమాని (3)
21. స్థూలకాయం వాడుక భాషలో... (2)

మాటలకోట - 67 జవాబు

1 సిం	హ	■	2 ఇం	ద్ర	3 జ	■	4 చా	5 సో
ధి	■	6 ము	ది	■	7 ల	త	■	నా
■	8 మా	■	ర	■	జ	■	9 చా	■
10 అ	యా	■	■	■	■	11 ని	రు	డు
■	12 బ	13 నా	■	14 మే	■	15 రా	మ	■
16 రా	జా	రా	17 వు	■	18 దా	శ	ర	థి
■	రు	■	లు	■	లి	■	క	■
19 శీ	■	20 గో	డు	■	21 గుం	డె	■	22 వ
23 త	ట్ట	■	24 ము	ప్పే	ట	■	25 త	ద

తాగుబోతు సలహా

(తాగుబోతు శేఖర్ ఒక పల్లెటూరు బార్‌కు వచ్చాడు)

బార్ వర్కర్: ఏమోయ్ శేఖర్ పోయినసారి వచ్చినపుడు తాగినదానికి డబ్బు ఇవ్వలేదేం?

శేఖర్: కాస్త ఇబ్బంది అయింది, ఇవాళ్లది పాతది కలిపి త్వరలో ఇస్తాలే.

హ్హా... హ్హా...

బార్ వర్కర్: అదేం కుదరదు. నాకసలే గుర్తుండదు. మా యజమానికి నేను లెక్క చెప్పాలి.

శేఖర్: అయితే గోడమీద రాసుకో.

బార్ వర్కర్: సరే అలాగే.

శేఖర్: ఒక్క విషయం నా బాకీ సంగతి నా స్నేహితులకు చెప్పవద్దు.

బార్ వర్కర్: అలాగే చెప్పనులే నువ్వు డబ్బిచ్చే వరకు గోడమీద మాత్రం రాసి ఉంచుతా!

- సత్య



గర్వభంగం

అడవిలో ఓ చెట్టుకింద బుల్లి ఏనుగుపిల్ల నిద్రపోతోంది. దానికి తల్లి ఏనుగు చెవులతో గాలి విసరసాగింది. ఇంతలో ఒక పిల్ల చీమ చెట్టు పైనుండి జారి బుల్లిఏనుగుపై పడింది. అది ఉలిక్కిపడి లేచి ఘీంకరించింది. పిల్లచీమను చూసి కోపంతో ఊగిపోతూ "నిన్ను నా తొండంతో కొట్టి చంపేస్తా" అంటూ తొండం పైకెత్తింది తల్లిఏనుగు.

"గజరాజా! గజరాజా! నా బిడ్డ నడుస్తూ పొరపాటున కాలుజారి పడింది. దయచేసి మమ్మల్ని వదిలిపెట్టు" అని కొంచెం దూరంలో ఉండి బతిమాలసాగింది తల్లిచీమ.

"అసలు మా జాతంటే ఏమనుకున్నావ్? దేవతా విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లేది మేమే. రాజులు, గొప్ప గొప్ప పండితుల హుందాతనాన్ని పెంచేదీ మేమే. అటువంటి పవిత్ర దేహాన్ని తాకే అర్హత మీకు లేదు. ఇంకెప్పుడైనా పొరపాటున నాకంట పడ్డారో చంపేస్తా" అని గట్టిగా ఘీంకరించింది తల్లిఏనుగు.

"అలాగే గజరాజా!" అంటూ అక్కడ్నుండి మెల్లిగా జారుకున్నాయి తల్లిచీమ, పిల్లచీమ.

ఇలా కొన్ని రోజులు గడిచిపోయాయి.

ఒకరోజు తల్లివెంట ఆహారానికి వెళ్లిన బుల్లి ఏనుగు దారి తప్పిపోయి తిరుగుతూ పొరపాటున ఒక గుంటలో పడిపోయింది. తల్లి ఏనుగు తన బిడ్డకోసం అడవిలో చాలాసేపు వెతికింది. కానీ బుల్లి ఏనుగు కనిపించలేదు. దిగులుతో తన స్థావరానికి చేరుకుంది తల్లిఏనుగు. ఇలా మూడు రోజులు గడిచిపోయాయి.

"గజరాజా! గజరాజా!" అనే పిలుపు వినబడితే లేచి చుట్టూ చూసింది తల్లి ఏనుగు.

"ఇక్కడ. చెట్టుకొమ్మమీదున్న చీమను గజరాజా" అంది తల్లిచీమ.

"ఇక్కడికెందుకొచ్చావ్? నా బిడ్డ తప్పిపోయిన బాధలో ఉన్నాను. వెంటనే ఇక్కడ్నుండి వెళ్లిపో" అంది కోపంగా తల్లి ఏనుగు.

"నీకో శుభవార్త తెచ్చాను గజరాజా! నేను, నా బిడ్డ ఈ అడవిని వదలి వెళ్తుంటే గుంటలో పడున్న నీ బిడ్డని చూశాం. విషయం తెలుసుకుని నా బిడ్డను అక్కడే ఉంచి నిన్ను వెతుక్కుంటూ వచ్చాను" అంది తల్లిచీమ.

"ఏంటీ? నా బిడ్డ దొరికాడా. ఎక్కడున్నాడు? త్వరగా చెప్పు" ఆత్రంగా అడిగింది తల్లి ఏనుగు.

"ఇక్కడ్నుండి దక్షిణం వైపు ఓ మైలు దూరంలో చిన్న గుడి ఉంది. దానికి దగ్గర్లో పెద్ద చెట్టు, దాని పక్కనే గుంట ఉంది. అందులో నీ బిడ్డ చిక్కుకున్నాడు" అని ఆనవాలు చెప్పింది తల్లి చీమ.

చీమ చెప్పిన ప్రదేశానికి హడావుడిగా వెళ్లి తన బిడ్డను రక్షించుకుంది తల్లి ఏనుగు. అక్కడే ఉన్న పిల్ల చీమ తల్లి ఏనుగును చూసి భయంతో దాక్కుంది. తల్లి చీమ కూడా దూరంగా నిలబడి చూడసాగింది.

"రా మిత్రమా! దగ్గరికి రా! అక్కడే ఆగిపోయావేం?" అంది తల్లి ఏనుగు తల్లి చీమతో.

తల్లి చీమ తనని చూసి భయపడుతున్నట్లు గమనించి "నన్ను క్షమించు చీమ మిత్రమా! గర్వంతో విర్రవీగి, అల్ప జీవివని నిన్ను అవహేళన చేశాను. అవమానాన్ని మనసులో పెట్టుకోకుండా, నా బిడ్డ ఎక్కడుందో చెప్పి మాకెంతో సహాయం చేశావు. అంతే కాకుండా నీ బిడ్డ కూడా శత్రుత్వం మర్చిపోయి నా బిడ్డతో స్నేహంగా ఉంది. ఈ విషయం నాకు చాలా ఆనందాన్ని కలిగిస్తోంది. నీకేం కావాలో కోరుకో" అంది తల్లి ఏనుగు.

"నాకేమీ వద్దు గజరాజా! మేం వేరే ప్రాంతానికి వెళ్తాం" అంది భయంగా తల్లి చీమ.

"మీరు ఎక్కడికీ వెళ్లొద్దు మిత్రమా. ఇకనుండి నన్నుచూసి భయపడనవసరం కూడా లేదు. ఈ అడవిలోనే మనం కలిసి ఉందాం. నీ కేమైనా సహాయం కావాలంటే చెప్పు" మళ్లీ అంది తల్లి ఏనుగు.

"ఏనుగు మిత్రమా! చిన్న కోరిక. తమ వీపుపై ఎక్కాలని నా కెప్పటినుండో కోరిక" అంది తల్లి చీమ.

"ఓస్! ఇంతేనా?" అంటూ తన వీపుపై తల్లి చీమను, తన బిడ్డపై పిల్ల చీమను ఎక్కించుకుని తిప్పాయి.

అవి ఎప్పటికీ అలా స్నేహంగానే ఉన్నాయి.

- పరాశరం శ్రీనివాసాచార్యులు



అద్దంలా...





అద్దం లాంటి జీవులున్నాయంటే ఆశ్చర్యం వేస్తుంది. ఇక్కడ కనిపించేవన్నీ అలాంటివే. కప్ప, సీతాకోకచిలుక, రకరకాల చేపలను చూస్తుంటే నోట మాట రాదు. వాటి లోపలి భాగాలు స్పష్టంగా కనిపిస్తుంటే మరింతే కదా. కాకపోతే వీటి పేర్లకు ముందు గ్లాస్, ఐస్, జెల్లీ వంటి పదాలుంటాయి. గ్లాస్ ఫ్రాగ్, ఐస్ ఫిష్, జెల్లీ ఫిష్, గ్లాస్ వింగ్ బటర్‌ఫ్లై...ఇవి వుంటాయన్నమాట. వెనిజులాలో కనిపించే గ్లాస్ ఫ్రాగ్ ఆకుపచ్చ రంగులో వుంటుంది. కాకపోతే పొట్ట భాగంలో చర్మం అద్దంలా వుంటుంది. అందుకే దాని గుండె, కాలేయం, జీర్ణాశయ భాగాలు స్పష్టంగా కనిపిస్తాయి. సీతాకోక చిలుక రెక్కలు కూడా అంతే. అద్దంలా వుంటాయి. వీటిని గబుక్కున గుర్తించడం కష్టం. ఇవి సెంట్రల్ అమెరికాలో వుంటాయి. గుండ్రపాటి గిన్నె బోర్లించినట్లు వున్న జీవి జెల్లీ ఫిష్. దీని శరీరంలోని భాగాలన్నీ కూడా ఎంచక్కా బయటికి కనిపిస్తాయి. ఎందుకో తెల్సా! ఈ చేప శరీరంలో 95 శాతం నీరే వుంటుంది. దీని శ్వాస కూడా చర్మం ద్వారానే జరుగుతుంది. ఇవేనా! అద్దంలా కనిపించే ప్రతి ప్రాణిదీ ఒక్కో ప్రత్యేకత!!